మోడీకి వ్యతిరేకంగా వరంగల్‌లో ఫ్లెక్సీలు

విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్



నవతెలంగాణ-వరంగల్

ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వరంగల్‌లో నిరసన వ్యక్తమవుతోంది. ప్రధాని రాకను నిరసిస్తూ వరంగల్ పట్టణంలో ఫ్లెక్సీలు, పోస్టర్లు భారీగా వెలిశాయి. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ 'నేను వరంగల్-నాది తెలంగాణ' అనే పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు దారి పొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టు ఏమైంది మోదీ ? గిరిజన విశ్వవిద్యాలయం ఏది?, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏమైంది? రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ ఏమయ్యాయని ప్రశ్నిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తెలంగాణలో పర్యటించే ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
వరంగల్, హనుమకొండ, జనగామ
మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి
ఆదివారం 9 జూలై 2023 1

ట్రాఫిక్ ఆంక్షలతో ప్రజల ఇబ్బందులు



నవతెలంగాణ-కాశిబుగ్గ

ప్రధాని నరేంద్ర మోడీ శనివారం వరంగల్ పర్యటన సందర్భంగా పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలు వల్ల వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు.ఉద్యోగాలకు వెళ్లేవారు అత్యవసర పనిపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురైనారు. హాస్పిటల్ కు వెళ్లే వారిని సైతం పోలీసులు అనుమతించలేదు దీంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు ప్రధాని మోడీ మామునూరు ఎయిర్‌పోర్ట్ నుండి రంగసాయిపేట మీదుగా బట్టల బజార్ ఫ్లైఓవర్ నుండి ఎంజీఎం జంక్షన్ నుండి భద్రకాళి ఆలయాన్ని సందర్శించుకుని అలంకార్ జంక్షన్ మీదుగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రాంగణానికి చేరుకున్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు మోడీ సభ ముగిసే వరకు ట్రాఫిక్ ఆంక్షలుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వ్యాగన్ పరిశ్రమతో అభివృద్ధి





5 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు : ప్రధాని మోదీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాజీపేటలో వ్యాగన్ తయారీ కేంద్రం ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందని, తెలంగాణలో జాతీయ రహదారులను 2,500 కిలోమీటర్ల నుండి 5 వేల కిలోమీటర్ల మేరకు పెంచామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో రూ.6,100 కోట్ల పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన విజయ సంకల్ప సభలో ప్రధాని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అవినీతి గణనీయంగా పెరిగిందన్నారు. బిజెపి తొలిసారి సాధించిన రెండు ఎంపీ సీట్లలో హన్మకొండ ఒకటని, ఇక్కడ జంగారెడ్డి ఎంపిగా విజయం సాధించారని మోదీ గుర్తు చేశారు. దేశాభివృద్ధికి హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఇండస్ట్రియల్ కారిడార్‌లు, ఎకనామికల్ కారిడార్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైల్వే ఉత్పత్తుల విషయంలో దేశం రికార్డులను సృష్టిస్తుందన్నారు. తెలంగాణలో రహదారుల కనెక్టివిటీని పెంచుతున్నామన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మిస్తామని చెప్పి నిర్మించలేదన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు కుటుంబ పార్టీలన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ను ఓడించి, వాటి అడ్రస్ గల్లంతు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో వర్చువల్ పద్ధతితో రూ.6,100 కోట్లతో రైల్వే వ్యాగన్ పరిశ్రమ, జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత అధికారులతో సమావేశం నిర్వహించి, విజయసంకల్ప సభలో ప్రసంగించారు.

పంచాయతీలకు నేరుగా నిధులు

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదని, సర్పంచ్‌లంతా రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహంతో వున్నారన్నారు. కుటుంబ పార్టీకి బుద్ధి చెప్పడానికి సర్పంచ్‌లు సిద్ధంగా వున్నారన్నారు. గ్రామీణాభివృద్ధికి నేరుగా నిధులు అందించాలనే కేంద్ర ప్రభుత్వం రూ.1 లక్ష కోట్లను పంచాయతీలకు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు.

5 వేల కిలోమీటర్ల మేరకు జాతీయ రహదారులు : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

తెలంగాణ రాష్ట్రంలో 5 వేల కిలోమీటర్ల మేరకు జాతీయ రహదారులను విస్తరింపచేశామని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కర్ తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందు 2,500 కిలోమీటర్లున్న జాతీయ రహదారులను నేడు 5 వేల కిలోమీటర్లకు పెంచామన్నారు. దేశంలో మౌళిక వసతుల కల్పనకు ప్రధాని మోదీ అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. పిఎం గతిశక్తి ద్వారా మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.

ఎందుకు బహిష్కరిస్తున్నవ్ కేసీఆర్..? : మంత్రి కిషన్‌రెడ్డి

ప్రధాని సభను ఎందుకు బహిష్కరిస్తున్నవో సీఎం కేసీఆర్ చెప్పాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ కాజీపేటలో వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేసి 3 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు సభను బహిష్కరించావా ? అని ప్రశ్నించారు. రామగుండంలో రూ.6 వేల కోట్లు వెచ్చించి ఎరువుల కర్మాగారం తెరిచినందుకు బహిష్కరిస్తున్నావా, హైద్రాబాద్ నుండి రెండు వందే భారత్ రైళ్లను ప్రారంభించినందుకు బహిష్కరిస్తున్నావా ? సమాధానం చెప్పాలన్నారు. ముందు కల్వకుంట్ల కుటుంబాన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. దళితులకు మూడెకరాల భూమినిస్తానని మోసం చేశావ్, కాపలా కుక్కలా వుంటానని, సీఎంగా దళితుడిని చేస్తానని మోసం చేశావన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని నిరుద్యోగులను మోసం చేశావన్నారు. మిమ్మల్నీ ఫామ్ హౌజ్‌కు పరిమితం చేసే రోజు దగ్గర్లోనే వుందన్నారు.

రూ.6,100 కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు

తొలుత ప్రధాని ఉదయం 10.15 గంటలకు మామునూరు ఏయిర్ స్ట్రిప్‌లో హెలికాప్టర్ నుండి దిగారు. అక్కడి నుండి నేరుగా భద్రకాళి దేవాలయం చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుండి నేరుగా హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానానికి 11.15 గంటలకు చేరుకున్నారు. రూ.521 కోట్లతో తలపెట్టిన కాజీపేట రైల్వే వ్యాగన్ తయారీ కేంద్రానికి, రూ.2,147 కోట్లతో తలపెట్టిన జగిత్యాల, కరీంనగర్, వరంగల్ ఇంటర్ కారిడార్‌లోని 68 కిలోమీటర్ల కరీంనగర్-వరంగల్ (ఎన్‌హెచ్ 563) నాలుగు లేన్‌ల రహదారి నిర్మాణానికి, నాగ్‌పూర్-విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో 108 కిలోమీటర్ల మేరకు మంచిర్యాల-వరంగల్ మధ్య రూ.3,441 కోట్లతో తలపెట్టిన నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై పాల్గొన్నారు. బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన ఇన్‌ఛార్జి ప్రకాశ్ జవదేకర్, మాజీ ఇన్‌ఛార్జి తరుణ్ చుగ్, జాతీయ ఉపాధ్యక్షులు డికె అరుణ, ఎన్నికల నిర్వాహణ కమిటీ ఛైర్మన్ ఈటెల రాజేందర్, ఒబిసి ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, మాజీ అధ్యక్షులు ఎంపీ బండి సంజయ్, ఎంపీలు ధర్మపురి అరవింద్, సోయం బాబురావు, మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కోండా విశ్వేశ్వర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎం. ధర్మారావు, వన్నాల శ్రీరాములు, మొలుగూరి భిక్షపతి, రావు పద్మ, కొండేటి శ్రీధర్, దశమంతరెడ్డి, కీర్తిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విభజన హామీలపై పెదవి విప్పని మోదీ

- విపక్షనేతల అరెస్టులపై సర్వత్రా విమర్శలు
- మోదీ సభపై భిన్నాభిప్రాయాలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి :

ప్రధాని నరేంద్ర మోదీ విభజన చట్టంలో ఇచ్చిన హామిలపై పెదవి విప్పకపోవడం విమర్శలకు తావిచ్చింది. శనివారం విజయసంకల్ప సభలో ప్రసంగించిన మోదీ విభజన చట్టంలో ఇచ్చిన హామిలు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీపై మాట్లాడకపోవడం గమనార్హం. ప్రధాని పర్యటనలో నిరసనలు తెలుపుతారనే అనుమానంతో కాంగ్రెస్, సిపిఐ (ఎం), సిపిఐ నేతలను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌లకు తరలించడం విమర్శలకు తావిచ్చింది. సభలో విభజన చట్టంలో ఇచ్చిన హామిలపై మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్, సిపిఐ (ఎం), సిపిఐ పార్టీలు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇదిలావుంటే ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వ దాటవేతకు నిరసనగా లంబాడి హక్కుల పోరాట సమితి నిరసన కార్యక్రమాలను నిర్వహించింది. శనివారం మోదీ పర్యటనలో 'గిరిజన విశ్వవిద్యాలయం ఏమైంది', 'మామునూరు ఏయిర్‌పోర్ట్ ఏమైంది' అంటూ ఫ్లెక్సీలు కట్టి మరీ నిరసన తెలపడం గమనార్హం.

ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ పర్యటనలో విభజన చట్టంలో ఇచ్చిన హామిలపై పెదవి విప్పకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ఏర్పాటులో భాగంగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన విభజన చట్టంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని హామినిచ్చారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఈ హామిలపై కేంద్రాన్ని ప్రశ్నించింది. సీఎం కేసీఆర్ సైతం వీటిపై బహిరంగంగానే ప్రశ్నించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు ఈరోజు కాజీపేటలో వ్యాగన్ తయారీ కేంద్రం నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.

నిరసన తెలిపిన ఎల్‌హెచ్‌పిఎస్

గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయకపోవడాన్ని నిరసిస్తూ లంబాడి హక్కుల పోరాట సమతి (ఎల్‌హెచ్‌పిఎస్) మోదీ పర్యటన సందర్భంగా నల్ల రిబ్బన్లు ధరించి శుక్రవారం నిరసన కార్యక్రమాలను నిర్వహించింది. శనివారం మోదీ రాక సందర్భంగా వరంగల్ నగరంలో పలు ప్రాంతాల్లో 'గిరిజన విశ్వవిద్యాలయం ఏమైంది..?', 'మామునూరు ఏయిర్‌పోర్ట్ ఏమైంది ?' అంటూ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ ఫ్లెక్సీలు, పోస్టర్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

విపక్ష నేతల అరెస్టులు

ప్రధాని పర్యటన సందర్భంగా ముందస్తుగా కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ (ఎం) నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌లకు, మడికొండలోని పోలీసు ట్రైనింగ్ కాలేజీకి తరలించారు. హన్మకొండ డిసిసి అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డిని హౌజ్ అరెస్ట్ చేశారు. మరో కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డిని హౌజ్ అరెస్ట్ చేసిన నేతలు అనంతరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. సిపిఐ (ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, కార్యదర్శివర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల, ముక్కెర రామస్వామి, హన్మకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, నాయకులు బానోతు, మంద సంపత్, కాడబోయిన లింగయ్య తదితరులను అరెస్ట్ చేసి మడికొండ పిటిసికి తరలించారు. మోదీ తిరిగి వెళ్లిపోయాక సాయంత్రం 4.00 గంటలకు నేతలను వదిలిపెట్టారు.

జన సమీకరణలో బీజేపీ నేతల వైఫల్యం...

హనుమకొండలో బీజేపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విజయ సంకల్ప సభను విజయవంతం చేయడంలో బీజేపీ శ్రేణులు చతికిల పడ్డాయి. గతంలో ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో జరిగిన బహిరంగసభలకు కన్నా గొప్పగా, ఖమ్మంలో కాంగ్రెస్ జనగర్జన సభ కంటే పెద్దఎత్తున ఈ సభను నిర్వహిస్తామని బీజేపీ నేతలు ప్రకటించిన విషయం విధితమే. శనివారం జరిగిన సభ కేవలం 25వేల నుండి 28వేల మంది ప్రజలను మాత్రమే తరలించడం చర్చనీయాంశంగా మారింది. సభా ప్రాంగణంలో వెనుకవైపున మైదానం ప్రాంతం, సభాస్థలిలో సగం ఖాళీగా ఉండడం కనిపించింది. బీజేపీ శ్రేణులు సభ సక్సెస్ అని ప్రచారం చేసుకుంటున్నా సభకు పెద్దఎత్తున ప్రజలను తరలించలేక పోయాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.



విభజన హామీలేవని ప్రశ్నిస్తే అరెస్టులా..

సీపీఎం హన్మకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి

నవతెలంగాణ-హన్మకొండ/ కాజీపేట

రాష్ట్ర విభజన హామీలేవని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సరికాదని సీపీఎం హన్మకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి అన్నారు. ప్రధాని మోడీ హన్మకొండకు రావడాన్ని వ్యతిరేకిస్తూ, విభజన హామీలను ప్రశ్నిస్తారనే భయంతోనే నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తున్నారన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రాంతానికి చెందిన కాజీపేట రైల్వేస్టేషన్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కాలేజీలు, ఐఐటీలు, మైనింగ్ యూనివర్సిటీ ఎర్పాటు తదితర వాగ్దానాలు ఇచ్చిన మోడీ వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందాడన్నారు. వాస్తవానికి పివోహెచ్ మంజూరు 2017 లోనే అయ్యిందని నిధుల కేటాయింపు విషయంలో జరిగిన ఆలస్యం తప్ప బిజెపి ప్రభుత్వం కాజీపేటకు ఇస్తుంది ఏమి కాదని ఆయన తెలిపారు. బిజెపి కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకుండా కాజీపేట ప్రాంతానికి తీవ్రమైన అన్యాయం చేస్తుందని ఆయన మండిపడ్డారు. వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసిన 900 మందికి మాత్రమే ఉపాధి దొరుకుతుంది. అదే కోచ్ ఫ్యాక్టరీ అయితే 5000 మందికి ఉపాధి దొరుకుతుందని పరోక్షంగా మరో 5000 మందికి ఉపాధి దొరికే అవకాశం ఉందని ఆయన అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ కాకుండా వ్యాగన్ పరిశ్రమ ఇస్తామని చెప్పడం సరైనది కాదని ఆయన అన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్ మాట్లాడుతూ మోడీ పర్యటనకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయాలన్నారు. తెలంగాణ విభజన చట్టంలోని హామీలను అమలు చెయ్యకుండా తెలంగాణలో వరంగల్ లో పర్యటించే నైతిక హక్కు లేదని అన్నారు.

రాజకీయంగా లబ్ధిపొందడం కోసం, కల్లబొల్లి వాగ్దానాలు చెప్పి మోసం చేయడం కోసం అధికారంలోకి రావడం కోసమే ఈ పర్యటన చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖజీపేట కార్యదర్శి తొట్టె మల్లేశం,భాను నాయకులు ఉన్నారు.

ట్రాఫిక్ మళ్లింపులో పోలీసుల విఫలం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రధాని మోదీకి మూడంచెల భద్రత కల్పించే క్రమంలో నగరంలో దుకాణాలను, ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయించడం విమర్శలకు తావిచ్చింది. ఇదిలావుంటే ట్రాఫిక్ మళ్లింపు కూడా సత్ఫలితాలనివ్వకపోవడం గమనార్హం. వరంగల్ నగరానికి వచ్చే వివిధ రహదారుల నుండి వచ్చే వాహనాలను శనివారం ఉదయం 4 గంటల నుండి సాయంత్రం 5 గంటలకు వరకు మళ్లిస్తున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్ ముందస్తుగా ప్రకటించారు. కాని ప్రధాని సభకు వచ్చిన ప్రజలు నగరంలోకి ప్రవేశించి ప్రధాన రహదారులపైనే వాహనాలను నిలిపివేయడంతో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. పార్కింగ్ స్థలాలను ప్రతిరోడ్డుకు ఏర్పాటు చేసినా, విజయ సంకల్ప సభను ఏర్పాటు చేసిన హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పరిసర ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేయడం గమనార్హం. సభ ముగిశాక రాకపోకలకు తీవ్ర అంతరాయంగా పరిణమించింది. సభ నుండి బయటకు రావడానికి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వాహనాలతో కిటకిట..

హన్మకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల పరిసరాల్లోని సుబేదారిలోని రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. ప్రైవేటు పాఠశాలల వాహనాలలో ప్రజలను తరలించారు. ఆ వాహనాలు పార్కింగ్ స్థలాల్లో కాకుండా నేరుగా సభా స్థలికి చేరువలోనే పార్కింగ్ చేయడం ఇబ్బందికరంగా మారింది. సభ ముగిశాక ప్రజలు మెయిన్ గేట్ నుండి బయటకు వెళ్లకుండా ప్రధాని కాన్వాయ్ వెళ్లే వరకు పోలీసులు అడ్డుకోవడంలో ప్రజలు పెద్దసంఖ్యలో ప్రహరి గోడలు దూకి రోడ్డుపైకి చేరారు. రహదారులపై ప్రజలను నియంత్రించడం పోలీసులకు సమస్యగా మారింది. సుబేదారి పోలీసు స్టేషన్ నుండి సర్క్యూట్ గెస్ట్ హౌజ్ రోడ్డు, నక్కల గుట్ట నుండి సుబేదారి రహదారి కిటకిటలాడింది.

భద్రకాళి అమ్మవారి ముందు ధ్యానంలో ప్రధాని మోడీ

ఆలయాన్ని సందర్శించిన మొట్టమొదటి ప్రధాని

పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు..

నవతెలంగాణ-మట్టెవాడ

కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి ,ఓరుగల్లు ఇలవేల్పు చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఓరుగల్లు భద్రకాళి ఆలయాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఉదయం సందర్శించారు. స్వతంత్ర భారతదేశంలో భద్రకాళి అమ్మవారిని దర్శించిన మొట్టమొదటి ప్రధానిగా నరేంద్ర మోడీకి ఆ ఘనత దక్కింది. దేశ ప్రధాని లు మునుపెన్నడు భద్రకాళి దేవాలయాన్ని సందర్శించిన దాఖలాలు గతంలో లేవు." ఓరుగల్లు భద్రకాళి దేవాలయన్నీ ప్రధాని మోడీ మామునూర్ బేస్ క్యాంపులో హెలికాప్టర్ దిగిన వెంటనే నేరుగా భద్రకాళి దేవస్థానానికి వచ్చి అమ్మవారి ఆశీస్సులు తీసుకోవడం విశేషం..

పూర్ణకుంభంతో స్వాగతం పలికిన వేద పండితులు

దేశ ప్రధాని మొట్టమొదటిసారిగా భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ పూలతో అలంకరించారు. దేవాదాయ కమిషనర్ అనిల్ కుమార్, అసిస్టెంట్ దేవాలయ కార్య నిర్వహణ అధికారి శేషుభారతి, ఆలయఅధికారులు గత రెండు రోజులుగా ఆలయంలో ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఆలయానికి విచ్చేసిన ప్రధానికి ఆలయ ప్రధాన పురోహితులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో పూజారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయానికి సంబంధించిన చరిత్ర వైభవాన్ని ఆలయ అధికారులతో పాటు కేంద్ర మంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు



కిషన్ రెడ్డి ప్రధానికి వివరించారు. ఆలయంలోకి ప్రవేశించిన ఆయన ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేసిన మహాజ్యోతికి ప్రజ్వలన చేసి ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించిన ప్రధాని గర్భగుడిలో ఉన్న గణపతికి ముందుగా పూజలు చేసి భద్రకాళి అమ్మవారికి ప్రాణమిల్లినారు. అమ్మవారికి ఎదురుగా ధ్యానముద్రలో కూర్చొని ప్రార్థనలు చేశారు. అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఆలయ మండపంలోకి విచ్చేసిన ఆయనకు పండితులు వేదమహా ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలతో పాటు ప్రసాదాన్ని అందించారు. గుడి చుట్టూ తిరిగి ఆలయ వైభవాన్ని తిలకించిన ఆయన బయటికి వచ్చిన అనంతరం భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని దేవాదాయ శాఖ కమిషనర్, దేవాలయ కార్య నిర్వహణ అధికారులు ప్రధానికి అందజేశారు. అమ్మవారి దర్శనం ముగించుకున్న అనంతరం నేరుగా హనుమకొండ జిల్లా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జరుగుతున్న బిజెపి పార్టీ విజయ సంకల్ప యాత్రకు బయలుదేరి వెళ్లారు.

మోడి వచ్చి ఓరుగల్లుకు ఏం వెలగబెట్టాడు?

ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం, అరూరి రమేశ్

నవతెలంగాణ-హన్మకొండ

గత వారం రోజులుగా రాష్ట్ర బిజెపి నేతలు హడావిడి చేసి ప్రధానమంత్రి మోడీ సమావేశం ఏర్పాటు చేస్తే మేము కూడా వరంగల్‌కు ఏమైనా లాభం జరుగుతుందని ఆశపడ్డామని కాని మోడి కెసిఆర్ ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప వరంగల్‌కు ఏం వెలగబెట్టాడో బిజెపి నేతలు వరంగల్ ప్రజలకు చెప్పాలని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ లు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే వరంగల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, అరూరి రమేష్ , ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి తదితరనాయకులతో కలసి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి తన ప్రసంగంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని అవినీతి ప్రభుత్వం అని అంటున్నారని అవినీతి ప్రభుత్వం అయితే 9 సంవత్సరాలుగా రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధిపై బహిరంగ చర్చకు బిజెపి నేతలు సిద్ధమా అని సవాల్ విసిరారు. అమ్మవారు భద్రకాళి పేరు తీసుకుని ప్రధాని మోడీ అపవిత్రమైన మాటలు మాట్లాడారని భద్రకాళి శాపం కచ్చితంగా బీజేపీకి తగులుతుందని అన్నారు.కేసీఆర్ తెలంగాణ ను అభివద్ధి చేయడం లేదనటం అంతకన్నా పెద్ద అబద్ధం ఏమైనా ఉంటుందా అని ప్రశ్నించారు. బిజెపి పరిపాలిస్తున్న రాష్ట్రాలలో తెలంగాణలో అమలవుతున్న దళిత బంధు, రైతుబంధు, రైతు బీమా ,షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి రైతులకు 24 గంటల ఉచిత కరెంటు లాంటి సంక్షేమ పథకాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం పై పగ తీర్చుకోవాలని ఈడి, ఐటి దాడులు చేస్తున్నారని ఉడత బెదిరింపులకు ఇక్కడ ఎవరూ భయపడరని అవినీతి పరుల గుండెల్లో కేసీఆర్ నిద్రపోతారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏమయ్యాయని 9 ఏళ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ నరేంద్ర మోడీని ఎన్నిసార్లు కలసి విన్నవించిన ఇప్పటికీ అతి గతి లేదని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా రైల్వే శాఖ మంత్రి దేశంలో ఇకనుండి కోచ్ ఫ్యాక్టరీలు ఉండవని ప్రకటించి మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా అక్కడ రెండు వేల కోట్లతో కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పారని అనంతరం గుజరాత్ లో కూడా కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పి రాజ్యాంగ విలువలను మోడీ కాలరాసారని ధ్వజమెత్తారు. కాలేశ్వరానికి జాతీయ హెూదా ఇవ్వమంటే



ఇవ్వలేదని కనీసం సమ్మక్క సారలమ్మ జాతరను కూడా గుర్తించలేదని సాక్షాత్తు భద్రకాళి అమ్మవారి దగ్గర ప్రత్యేక పూజలు చేసి అక్కడ కూడ ఒక్క రూపాయి ఇవ్వకుండా చివరకు దేవుళ్లను కూడా మోసం చేస్తున్నారని అన్నారు.తెలంగాణకు ప్రాజెక్టులు ఇచ్చే మొహం లేదు కానీ అవమానించే మాటలా అని అన్నారు.బీజేపీ కి రోజులు దగ్గర పడ్డాయని మోడీ అధికారం శాశ్వతం కాదని గుర్తు పెట్టు కోవాలని హెచ్చరించారు.వరంగల్ మేయర్ సీటు మేము గెలిస్తే బీజేపీ ట్రైలర్ చూపించింది అని మోడీ మాట్లాడుతున్నాడు బీజేపీ ఎన్ని సీట్లు గెలిచినదో పీఎం కు తెలుసా అని ప్రశ్నించారు.కాజీపేట లో వాగన్ ల ఫ్యాక్టరీ అని మోడీ తప్పు దోవ పట్టిస్తున్నాడని 520 కొట్ల తో వాగన్ ఫ్యాక్టరీ వస్తుందా గుజరాత్ లో 20 వేల కోట్లతో కోచ్ ఫ్యాక్టరీ తెలంగాణ వచ్చేసరికి ముష్టి 500 కోట్లు మాత్రమే ఇస్తారా అని అడిగారు.బీజేపీకి వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాగన్ ఫ్యాక్టరీ వస్తే మూడు వేలు ఉద్యోగాలు వస్తాయన్న మోడీ తాను తరలించుకుపోయిన కోచ్ ఫ్యాక్టరీ 30 వేల ఉద్యోగాలు వస్తాయని మరి తెలంగాణ యువతకు ఉద్యోగాలు వద్దా మోడీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.దేశాన్ని పెట్టుబడి దారులకు దోచిపెడుతున్న మోడీ అవినీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. దేశ ప్రజలకు అవినీతి లేని పాలన అందిస్తామని ఒక్కొక్కరికి రూ.15 లక్షలు, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఊదరగొట్టిన మోడీ దేశ ప్రజలను మోసం చేసిన మోసగాడు అని అన్నారు.ప్రభుత్వాలను పడగొట్టి, ప్రజా ప్రభుత్వాలను చీల్చే ప్రధాని మోడీ ప్రజాస్వామ్యం, ప్రజల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు.ఒక్క మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఒక్క నవోదయ పాఠశాల తెలంగాణకు కేటాయించని మోడీ తెలంగాణ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. ^ంలో కూడా చైర్మన్ సుందర్ రాజు యాదవ్, బిఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



చప్పగా సాగిన మోడి ప్రసంగం

తెలుగు అనువాదం లేకపోవడంతో పెద్దగా స్పందించని జనం

నవతెలంగాణ-హన్మకొండ

వారంరోజులుగా హన్మకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రధాన మంత్రి మోడి విజయ సంకల్ప సభ కోసం రాష్ట్ర బిజెపి నేతలు విసత ఏర్పాట్లు చేశారు.మొత్తం మూడు పెద్ద సభావేదిక లు ఏర్పాటు చేసి ప్రజలు వీక్షించడానికి ఎల్ ఇ డి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం లోకి ప్రధానమంత్రి మోడి 11.20 నిమిషాలకు చేరుకున్నారు.ముందుగా ప్రత్యేకంగా అధికారికంగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో కొంతమంది అధికారుల సమక్షంలో గవర్నర్ తమిళ సై, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, పర్యటక శాఖ మంత్రి ఇటీవల నూతన అధ్యక్షులుగా ఎన్నికైన కిషన్ రెడ్డి మాజీ అధ్యక్షుడు ఎంపీ బండి సంజయ్ లతో కలిసి రూ,6100 కోట్ల అభివద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం 11.32 నిమిషాలకు తన ప్రసంగాన్ని ప్రారంభించి 11.40 నిమిషాల వరకు కేవలం ఎనిమిది నిమిషాలు మాత్రమే మాట్లాడారు. మొదటి ప్రసంగంలో రాజకీయ వ్యాఖ్యలు చేయలేదు. అనంతరం బహిరంగ సభకు 11.55 కు చేరుకున్నారు. బహిరంగ సభలో మొదట ఈటల రాజేందర్, అనంతరం బండి సంజయ్,కిషన్ రెడ్డి లు మాత్రమే మాట్లాడారు.బహిరంగ సభ లో మోడీ మ,12.20 కి ప్రసంగం ప్రారంభి 12.45 నిమిషాలకు ముగించాడు. కానీ మోడీ తన ప్రసంగంలో ప్రతిపక్షాలపై ప్రధానంగా కేసీఆర్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తూ సుదీర్ఘంగా మాట్లాడారు.

ఓరుగల్లు ప్రజలను నిరశపరచిన మోడి

దాదాపు 30 ఏళ్ల తర్వాత భారత ప్రధానమంత్రి హోదాలో వరంగల్ కు వచ్చిన మోడీపై వరంగల్ ప్రజలు గంపెడంత ఆశలు పెట్టుకున్నారు. నిజానికి మరో ఐదు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు ఉండగా ఈసారి ఎలాగైనా బీజేపీ అధికారంలోకి రావడానికి ప్రధానమంత్రి రాష్ట్రంపై వరాల జల్లు కురిపిస్తాడని రాష్ట్ర బిజెపి నేతలు కూడా నమ్మకంగా ఉన్నారు. కానీ అందరి ఆశల్ని మోడీ నీరుగార్చి వరంగల్‌కు మొండిచేయి చూపించాడు. ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న విభజన హామీలైన బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఈ మూడింటిలో ఏదో ఒకటి ప్రకటిస్తాడని అనుకుంటే మోడీ తన ప్రసంగంలో ఆ ఊసే ఎత్తలేదు.. మోడీ తన పర్యటనలో భాగంగా మామునూరు ఎయిర్పోర్టులో హెలికాప్టర్ దిగడంతో మామునూరు ఎయిర్పోర్ట్ పై ఏదైనా ప్రకటన ఉంటుంది అనుకుంటే అది కూడా నిరాశనే మిగిలింది.చివరికి తన పర్యటనలో మొదటి భద్రకాళి అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేయడంతో భద్రకాళి దేవాలయానికి గాని వేయి స్తంభాల దేవాకాయానికి గాని అభివద్ధి కోసం ఏమైనా నిధులు మంజూరు చేస్తారనుకుంటే చివరకు దేవుళ్లకు కూడా మొండి చేయి చూపించారు.

నాయకుల మధ్య ఆధిపత్య పోరు

ఇంత పెద్ద సభలో మోడీ ప్రసంగానికి ముందు నలుగురు అంటే నలుగురే మాట్లాడారు. కానీ వారి ప్రసంగాలలో ఐక్యత లేదని అర్థం అయిపోయింది. మొదట మాట్లాడిన ఈటల తన ప్రసంగంలో కిషన్ రెడ్డి పేరు తప్ప రాష్ట్ర నాయకులు మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ పేరు గాని వేరే పేరు గాని ఉచ్చరించలేదు. అలాగే బండి సంజయ్ కూడా కిషన్ రెడ్డి పేరు తప్ప రాష్ట్ర నాయకులలో ప్రజల కమిటీ చైర్మన్ ఈటల పేరు కానీ మరెవరి పేరు గాని ఉచ్చరించలేదు.

చప్పగా సాగిన ప్రసంగం...

దాదాపు 20 నిమిషాలు మాట్లాడిన మోడీ ప్రసంగం అంతా చప్పగా సాగింది. తన ప్రసంగమంతా ప్రతిపక్షాలను తిట్టడంతోనే సరిపోయింది.సభకు ఎక్కువ సంఖ్యలో జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల నుండి జనం ఎక్కువ రావడంతో వారికి హిందీ అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. సభ ప్రాంగణమంతా నిశ్శబ్దం ఆవరించింది. రాష్ట్ర బిజెపి నేతలు మోడి ప్రసంగానికి తెలుగు అనువాదం చేయడానికి ఎవరిని నియమించకపోవడం స్వయంకపరాదమే...

బాధితుడికి సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామానికి చెందిన వేల్పుల కరుణాకర్ ఇటీవల అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేరి ఖర్చుల పాలైన అతడు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన సీఎం సహాయ నిధి రూ.27వేల చెక్కును మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ నాయకులు బాధితునికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ చెంద్రయ్య, వార్డుసభ్యులు బండి స్వామి, ఆకుల శ్రీనివాస్, సది, గ్రామశాఖ అధ్యక్షుడు కేశారపు చంద్రయ్య, ఇందారపు శివ, ప్రభాకర్, దుర్గాప్రసాద్, భూమయ్య, శేఖర్‌లు పాల్గొన్నారు.

మహదేవపూర్ ఎంపీపీ అవిశ్వాసానికి
క్యాంపుకు తరలివెళ్లిన ఎంపీటీసీలు

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవపూర్ మండలం ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎంపీటీసీలు సిద్ధమయ్యారు. ఈమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్డీఓకు వినతి పత్రాన్ని అందించారు. ఈనేపధ్యంలో శనివారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు బండం లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో ఎంపీటీసీలు క్యాంపుకు తరలి వెళ్లారు. ఎంపీపీ నాలుగేళ్ల పదవీకాలం పూర్తవడంతో అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉన్న నేపథ్యంలో మహదేవపూర్ ఎంపీటీసీ చల్ల రమణ, బొమ్మపూర్ ఎంపీటీసీ బండం పుష్పలత, కాళేశ్వరం ఎంపీటీసీ రేవెల్లి మమత, బెగళూరు చల్ల పద్మ, అంబటిపల్లి బీసుల జయశ్రీలు క్యాంపుకు తరలివెళ్లారు.

నేషనల్ హైవే నిర్వాసితులకు న్యాయం చేయాలి
పీఎం, సీఎంలకు ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వినతి



నవతెలంగాణ-మల్హర్‌రావు

మంచిర్యాల నుండి వరంగల్ వరకు త్వరలో నేషనల్‌హైవే రోడ్డు నిర్మాణ పనుల కోసం భూసే కరణ కార్యక్రమాన్ని, శంకుస్థాపన చేయబోతున్న నేపథ్యంలో హైవేలో భూములు కోల్పోతున్న మంథని నియోజకవర్గంలో రైతులకు న్యాయంచేయాలని పీఎం, సీ ఎంలకు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మేయిల్ ద్వారా వినతిపత్రాలను పంపినట్లుగా ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిపాదించిన రేటు కాకుండా రైతులకు న్యాయం చేసేవిధంగా ఎకరానికి రూ.25 లక్షలు, బోరు బావులకు రూ.10 లక్షలు, పైప్ లైన్లకు రూ.నాలుగులక్షలు నష్ట పరిహారంగా ఇవ్వాలని, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, నితిన్ గడ్కరీ, దేశ రోడ్డు రవాణా అండ్ రహదారుల మంత్రికి, తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌లకు విన్నవించారు. మంథని నియోజకవర్గప్రాంతలైన ఒడేడు,అడవీ శ్రీరాంపూర్, ముత్తారం, సర్వారం, కాజీపల్లి, లక్కారం, మచ్చుపేట, నవాబ్‌పేట, బేగంపేట, ఆదివారంపేట, రాజాపూర్, రామయ్యపల్లి, పుట్టపాక, నగరంపల్లి, కన్నాల, వేంపాడు, పందులపల్లి, నాగారం ఇతర గ్రామాల రైతులకు ఎకరానికి రూ.25లక్షలు, బోరు బావికి రూ.10 లక్షలు, పైపులైన్ కోల్పోయిన వారికి రూ.4 లక్షలు నష్టపరిహారం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రోడ్డు కోసం సేకరించే భూమి నాణ్యమైన సారవంతమైన వ్యవసాయ భూమి రెండు పంటలు పండుతాయన్నారు. భూమి పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలుగా ఉన్నటువంటి రైతులు ఈరోడ్డు నిర్మాణం వల్ల రోడ్లపై పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు .ప్రభుత్వం భూసేకరణ కోసం ఇచ్చినటువంటి ప్రాథమిక నోటిఫికేషన్ ఎస్ఓ1015(ఈ) డిటి. 02.03.2021 పేర్కొన్న విధంగా డ్రై లాండ్ కాదని, ఈభూసేకరణ వల్ల చాలా కుటుంబాల వారికి ఉన్నటువంటి వ్యవసాయ భూముల్లో 90శాతం భూములు కోల్పోతున్నారు. అలాంటి వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం నుండి నష్ట పరిహారం ఎకరానికి రూ.50 లక్షలు ఇవ్వాలని కోరారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి
సీఐటీయూ రాష్ట్ర నాయకులు బందు సాయిలు



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

డీవైఎఫ్ఐ జిల్లా విద్యా,వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయ వంతం చేయాలని, సీఐటీయూ రాష్ట్ర నాయకులు బందు సాయిలు కోరారు. శని వారం జిల్లాకేంద్రంలోని శ్రామిక భవనంలో శిక్షణా తరగతుల కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30, 31న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరగబోయే జిల్లా విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులలో 100 మంది ముఖ్య నాయకులూ పాల్గొంటున్నారన్నారు. జిల్లా విద్యా, వైద్యం, ఉపాధిరంగాలలో, ఇతరత్రా శాఖలలో యువజన సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న డీవైఎఫ్ఐ ఉద్యమాన్ని, నాయకత్వాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు సమస్యలపై శాస్త్రీయ సైద్ధాంతిక అవగాహనతో పోరాటాలు నిర్వహించేందుకు ఈశిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు.రాజకీయ శిక్షణ తరగ తులను విద్యార్థి, యువజన, మేధావులు పెద్దలు వ్యాపారవేత్తలు, సంస్థలు, ఉద్యోగులు ప్రతిఒక్కరూ తమవంతు ఆర్థికసహకారాన్ని అందించి ఈయువజన సంఘం శిక్షణాతరగతుల విజయవంతానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి శ్రీకాంత్, జిల్లాగర్ల్స్ కన్వీనర్ చొప్పదండి స్వర్ణలత, కోకన్వీనర్ గడ్డంకవిత, జిల్లాకమిటీ సభ్యులు ప్రత్యూష, జ్యోతిలు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ఎమ్మెల్సీ రమణ పూజలు



నవతెలంగాణ-మహదేవపూర్

తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ ఎల్.రమణ శనివారం మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరానికి విచ్చేసిన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కాటారం సహకార బ్యాంకు చైర్మన్ చల్లా నారాయణ రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి గంగారాం ఇటీవలే మరణించగా కాళేశ్వరం ముక్తీశ్వర స్వామి గోదావరి నదీతీరాన వేదంపండితుల మంత్రోచ్ఛరణలతో వారి తండ్రి యొక్క అస్తికలను త్రివేణి సంగమంలో నిమజ్జనం చే యడం జరిగింది. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో గూడు కట్టుకున్న వైఎస్సార్
మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు

పేదప్రజల గుండెల్లో చిరస్థాయిగా గూడు కట్టుకుని నిలిచిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. వైఎస్ఆర్ 74వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రిగా ఎదిగి ప్రజల కష్టాలను తెలుసుకొని ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత రాజశేఖర్‌రెడ్డిదన్నారు. వైఎస్సార్ చేపట్టిన సంక్షేమాలు ప్రతి ఇంట్లో దర్శనమిస్తాయని, నేటికీ ఆయన ఆశయాలను అన్ని పార్టీలు అమలు చేస్తాయని, సంక్షేమాల్లో ఆయనకు సాటి ఎవరూలేరని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ ఫలాలు అందరికి దక్కుతాయనన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు కాంగ్రెస్ అండగా ఉంటుంది



నవతెలంగాణ-మల్హర్‌రావు

అధైర్య పడవద్దు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడితేల రాజయ్య అన్నారు. మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శభాష్‌నగర్‌కు చెందిన పిల్లమర్రి మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటు ంబాన్ని శనివారం కాంగ్రెస్ నాయకులు పరామార్శించి ఓదార్చారు. అధైర్య పడ వద్దు కాంగ్రెస్ పార్టీ పార్టీ అండగా ఉంటుందని ఓదార్చి ప్రగాఢ సానుభూతి ప్రక టించారు. ఈకార్యక్రమంలో భూపాలపల్లి కాంగ్రెస్ కార్యదర్శి జంగిడి శ్రీనివాస్, సర్పంచ్ జనగామ స్వరూప బాపు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి : ఈటెల



నవతెలంగాణ-వరంగల్

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఓరుగల్లులో రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీకి భూమి పూజ చేయడం శుభ సూచకమని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ అన్నారు. అనంతరం ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం గద్దదించే బాధ్యత బీజేపీ నిర్వహిస్తుందన్నారు. కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ ఒకటి అని దుష్ప్రచారాలు చేస్తున్నారు. కానీ బీఆర్ఎస్, బీజేపీ ఎప్పుడు ఒకటి కాదన్నారు. ప్రజలంతా నిండుమనసుతో ఆశీర్వదించి కళ్ళల్లో మట్టికొట్టిన కేసీఆర్‌ను గద్దె దించాలన్నారు.

ప్రధానికి అధికారుల ఘన స్వాగతం

వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయంలో ఉదయం 8:12 గంటలకు హెలికాప్టర్ నుండి భారత ప్రధానమంత్రి మోది దిగడంతో వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తానాయక్, వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏవి రంగనాథ్‌లు స్వాగతం పలికారు. మామునూర్ విమానా శ్రయం నుండి బట్టల బజార్ మీదుగా భద్రకాళి దేవాలయాన్ని సందర్శించిన అనంతరం హనుమకొండ జిల్లా ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభాస్థలికి విచ్చేశారు. మొదటగా ప్రధానమంత్రి మోడీకి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ, బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శాలువాలు కప్పి సన్మానించారు.

ఈ జన్మకు ఇది నాకు చాలు : బండి సంజయ్

ప్రధానమంత్రిని ఒక్కసారి చూడాలనుకున్న అతని నోటి నుండి బండి సంజయ్ అని పిలవాలి అనుకున్నా కాని దగ్గరుండి చూసే భాగ్యం లభించింది. కమలం పువ్వు ఎంపీగా గెలి పించింది. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశాను. అందుకే ఈజన్మకు ఇది చాలన్నారు. రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ ద్వారా 3 వేల నుంచి 10వేలమంది ఉద్యోగాలు ఇక్కడి ప్రజలకు కల్పించడానికి ప్రధాని మంత్రి మోదీ వచ్చాడన్నారు. రూ.2147కోట్లతో ఎన్‌హెచ్ అభివృద్ధి చేశాడన్నారు. రాష్ట్రంలో అవినీతిని అంతం చేయడానికి రామరాజ్యంతెస్తామన్నారు.

ఎన్నికల యుద్ధంలో బీఆర్ఎస్‌ను ఓడించాలి : కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు

ఎన్నికల యుద్ధంలో బీఆర్ఎస్‌ను ఓడించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్య క్షుడు కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం విజయసంకల్ప సభలో ఆయన మా ట్లాడుతూ దేశ ప్రధానిని చూడాలని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చారు. అభి వృద్ధి పనులు ప్రారంభించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ వస్తే కార్యక్రమాన్ని బహిష్కరించాలని కొందరు అంటున్నారన్నారు. కరీంనగర్‌లో ఎరువుల ఫ్యాక్టరీ పె ట్టినందుకు ప్రధాని మోదీని ఎవరైనా బైకాట్ చేస్తారా అని ప్రశ్నించారు. ఎవరైనా బైకాట్ చేయాలంటే కల్వకుంట్ల కుటుంబాన్ని బైకాట్ చేయాలన్నారు. దళితులకు మూడెకరాల భూమిని ఇవ్వనందుకు, నిరుద్యోగులకు రూ.3000 ఇస్తామని మోసం చేసిన కల్వకుంట్ల కుటుంబాన్ని బైకాట్ చేయాలన్నారు. నిరుద్యోగులే కల్వ కుంట్ల కుటుంబాన్ని బహిష్కరిస్తారన్నారు. రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తా మని మోసం చేసిన తెలంగాణ రైతులు కల్వకుంట్ల కుటుంబాన్ని బైకాట్ చేస్తా రన్నారు. రైతుల అప్పులు మాన్పిస్తామని చెప్పి, రైతు రుణమాఫీ మాన్పిం చినందుకు రైతులే కల్వకుంట్ల కుటుంబాన్ని బైకాట్ చేస్తారన్నారు. ఈరాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్న చరిత్ర ఉందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ బొమ్మ బొరుసు వీటికి భవిష్యత్ ఉండదన్నారు. తెలంగాణకు అన్యాయం చేస్తున్నదని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే ఎంఐఎం పార్టీని మోసం చేస్తున్నాయన్నారు.

మతోన్మాదాన్ని, రౌడీయిజాన్ని, గుండాయిజాన్ని పెంచి పోషి స్తుంది బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. కల్వకుంట్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరవేస్తామన్నారు. అందుకు బీజేపీ నాయకులు సమిష్టిగా కార్యకర్తలతో అండగా ఉండి తెలంగాణ అసెంబ్లీ పైన కమలం జెండా ఎగరేయాలి. సీతమ్మ, భద్రకాళి సాక్షిగా కల్వకుంట్ల కుటుంబాన్ని గద్దె దించాలన్నారు.

జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి





నవతెలంగాణ-చిట్యాల

జీపీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు మండల సమ్మె చేపట్టిన మండల గ్రామ పంచాయతీ సిబ్బందికి భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గండ్ర సత్యనారాయణరావు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు చేస్తున్న సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా మూడో రోజుకు చేరుకుంది. కాగా గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలను శుభ్రం చేసి అద్దంలా తీర్చిదిద్ది ప్రజల ఆరోగ్యాలను కాపాడుతుంటే రాష్ట్రప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో వివక్ష చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది పంచాయతీ సిబ్బంది ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 51ని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయకార్యదర్శులుగా నియమించాలన్నారు. గ్రామపంచాయతీలలోని ప్రతి ఉద్యోగి, కార్మికుడికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన పంచాయతీరాజ్ శాఖామంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందించి, జీపీ సిబ్బంది, నాయకులతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జీఎస్సార్ ప్రభుత్వాన్ని కోరారు లేని పక్షంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జీఎస్సార్ వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు, సీఆర్ పల్లి గ్రామ సర్పంచ్ మోకిరాల మధు, వంశీ, కృష్ణ, చిట్యాల మాజీ జడ్పీటీసి ఓరం సమ్మయ్య తదితరులు ఉన్నారు.

మహాముత్తారంలో: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని జీపీ కార్మికులసమ్మె 3వరోజు యధావిధిగా కొనసాగుతుంది. మూడు రోజులపాటుగా పల్లెల్లో పారిశుద్ధ కార్మికులు సమ్మెలో ఉండడంతో పల్లెలు మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఇంకొన్ని దినాలు ఇలాగే ఉంటే గ్రామాలు మొత్తం ఉక్కిరిబిక్కిరి అయ్యే అవకాశం ఉంది. పల్లెల్లో పారిశుద్ధ కార్మికులు పనిచేయకపోతే పల్లెల్లో ఉన్న ప్రజలు రోగాలు వచ్చి విషజ్వరాల పాలై మరణించే అవకాశం ఉంది. ఇప్పటికైనా జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

మహదేవ్‌పూర్‌లో: మూడవరోజుకు చేరుకున్న గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె మహ దేవపూర్ మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్మికులు తమడిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె నిర్వహి ంచడం జరుగుతుంది. ఈసమ్మెను చట్టబద్ధంగా శాంతియుతంగా నిర్వహి ంచడం జరుగుతుందని, ప్రభుత్వం స్పందించి తమ సమస్యల పరిష్కారం చేయాలని, సమ్మెకు గ్రామసర్పంచులు, గ్రామప్రజలు, అధికారులు సహకరి ంచాలని గ్రామపంచాయతీ కార్మికులసంఘం కోరారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు కేసీఆర్ సింగ్ 5 మండలాల ఇన్చార్జికుమ్మరి రాజబాబు మండల గౌరవ అధ్యక్షులు రాజమౌళిమండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-గణపురం

గణపురం మండలం చెల్పూర్ కేటీపీపీ లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల వ్యవస్థాపక జనరల్ సెక్రెటరీ మాతంగి శ్రీనివాస్. అన్నారు. శనివారం కేటీపీపీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశం కేటీపీపీ రీజినల్ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు మోతే తిరుపతి. మోరే కుమార్‌ల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్య లు పరిష్కరించాలన్నారు. ప్రమోషన్‌లలో జరగబోయే నష్టాన్నిఎదుర్కొనే దిశగా ముందుకు పోవాలన్నారు. అపరిష్కృతమైన సమస్యల సాధన కోసం ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఏకమై పరిష్కరించుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను యాజమాన్యం. ప్రభుత్వం స్పందించి పరిష్కారానికి మార్గం చూపాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు పీఎం రాజు. రాష్ట్ర కమిటీ సభ్యులు జనార్ధన్, రవీందర్, దండోర శ్రీనివాస్, మోరె రవి, రిజినల్ కమిటీ ఉపాధ్యక్షులు పొన్నాల తిరుపతి, కార్యనిర్వహక అధ్యక్షులు ఇనుగాల కుమార్, కోశాధికారి బొమ్మకంటి రాజేందర్, సభ్యులు ప్రభాకర్, మల్లేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడిగా కాటారం సర్పంచ్

నవతెలంగాణ-కాటారం

ఆయన గ్రామ సర్పంచ్ గ్రామంలో అభివృద్ధి పనులు చేయించాలి కాని రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టడంతో పారిశుద్ధ కార్మికులు గైర్హాజరు కావడంతో గ్రామంలోని ఎక్కడ సమస్యలు అక్కడే నిలిచిపోయాయి. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలో పేరుకుపోయిన చెత్త, చెదారం వల్ల వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలకు ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశంతో కాటారం ఇంచార్జ్ సర్పంచ్ నాయిని శ్రీనివాస్ పంచాయితీ ట్రాక్టర్‌తో చెత్తను సేకరిస్తూ డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. మండలంలోని ప్రజలు,ఇంచార్జ్ సర్పంచ్ శ్రీనివాస్‌ను అభినందించారు.

పోడు రైతులను దగా చేసిన రాష్ట్ర ప్రభుత్వం
ప్రజా సంఘాల నాయకులు

నవతెలంగాణ-కాటారం

రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతులను దగా చేసిందని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. శనివారం కాటారంలో పత్రిక విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు పీక కిరణ్, అక్కల బాపు, బుర్రి కుమారస్వామి, శంకర్‌లు మాట్లాడారు. వీరితో కలిసి పీక కిరణ్ మాట్లాడుతూ పోడు సేద్యం చేసుకుంటున్న రైతులకు 11లక్షల ఎకరాలకు పట్టాలిస్తామని గత బడ్జెట్ సమా వేశాల సందర్భంగా అసెంబ్లీలో ప్రకటించిన కేసీఆర్ ఇప్పుడు కేవలం నాలుగున్నర లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలిచ్చి పోడురైతులని దగాచేశాడని ఎన్నికల తాయిలాలలో భాగంగా కొద్ది మంది పోడు రైతులకు తూతూమంత్రంగా పట్టాలిచ్చి మెజారిటీ పోడురైతులను వారి భూములు నుండి వెళ్లగొట్టడానికి కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని వారు ఆరోపించారు. ఇప్పటికే ఫారెస్ట్ అధికారులు పట్టాలు రాని వారందరూ తమ భూములను వదిలి వెళ్లాలని హెచ్చరికలు చేస్తున్నారని, మరొకవైపున అధికార పార్టీ నేతలు పోడు రైతుల నుండి పట్టాలిప్పిస్తామని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని వారన్నారు. అటవీ హక్కుల చట్టం నిర్దేశించినట్లుగా, ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా పోడు రైతుల ందరికీ పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా వైఎస్సార్‌టీపీ ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-గణపురం

దివంగత నేత ,మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి, వైఎస్సార్ తెలంగాణ పార్టీ రెండవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం మండలంలోని కర్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వైఎస్ఆర్‌టీపీ మండల అధ్యక్షుడు సోక్కం సదయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలువేని సురేందర్‌రెడ్డి, దొండపాటి మధుకర్ రెడ్డి, ఎం ప్రభాకర్, భీష్మాచారి, మోహన్ ,ప్రవీణ్, రాకేష్, బద్రి, సంపత్, మహేష్, నరసింహులు, రాజు, రఘు, నవీన్, రమేష్ ,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలి
జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.రామ్‌కుమార్



నవతెలంగాణ-భూపాలపల్లి

ఈనెల 10 నుండి 15వ తేదీ వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతంగా పూర్తిచేయాలని డీఈవో ఎన్. రాంకుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈనెల 10వతేదీ నుండి 15వ తేదీ వరకు పాఠశాలస్థాయి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలని సంబంధిత హెచ్‌ఎంలను ఆదేశించారు.

రోజువారి కార్యక్రమాలు

10 వ తేదీ పఠనోత్సవం, గ్రంథాలయవారోత్సవాలు సూచిస్తూ ఒక ఫ్లెక్సీ తయారుచేసి పాఠశాలలో అందరికీ కనపడేవిధంగా ఉంచాలన్నారు. పఠనం ప్రాముఖ్యత గురించి ఎవరైనా ప్రముఖ వ్యక్తిచే పిల్లలకు అవగాహన కల్పిం చాలన్నారు. పిల్లలచే పుస్తక పఠనం చేయించాలన్నారు.గ్రంథాలయ వారో త్సవాలు దీనిలో భాగంగా పాఠశాలలో చేపట్టబోయే వివిధ కార్యక్రమాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.11వ తేదీ పుస్తక పఠనం యొక్క ఆవశ్య కతను తెలియజేస్తూ ఇంటింటికి ర్యాలీగా వెళ్లాలన్నారు.పుట్టినరోజు లాంటి వివిధ సందర్భాల్లో పిల్లలకు బహుమతిగా పుస్తకాలను అందజేయటం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.12, 13 వ తేదీల్లో పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలను సేకరించే కార్యక్రమం చేపట్టాలన్నారు.దాతల నుండి గాని, పాఠశాల ఉపాధ్యాయ ఇళ్లలో ఉండే వివిధ రకాల కథల పుస్తకాలు గాని, వార్తాపత్రికలలో పిల్లల పేజీలలో ఉండే కథలు, బొమ్మలు వివిధ రకాల పజిల్స్ వంటి వాటిని సేకరించడం, వీటన్నింటినీ పిల్లలకి అందుబాటులో ఉం చేట్లుగా చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 14 వ తేది పఠన సా మాగ్రి అభివృద్ధి విద్యార్థుల చేత పేపర్ కటింగ్స్ లేదా కార్టూన్స్ పజిల్స్ మొదలైన రీడింగ్ కార్డ్స్‌ని ఒక్కో పాఠశాలకు వంద చొప్పున స్వయం అభ్యసన సామాగ్రి త యారు చేయించి అందుబాటులో ఉంచాలన్నారు. 15వతేదీ తల్లిదండ్రుల సమా వేశంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయిం పోటీలు నిర్వహించాలన్నారు. పఠన పోటీలలో భాగంగా పిల్లలచే కథలు చదివించడం, పుస్తక సమీక్ష, పిల్లలు సొంతగా కథలు చెప్పటం, వంటి అంశాలలో పోటీలను నిర్వహి ంచాలన్నారు. వేగంగా, తప్పులు లేకుండా చదవగలటం అనే అంశంలో కూడా పో టీలు నిర్వహించాలన్నారు.

టిప్పర్, ద్విచక్రవాహనం ఢీ : ఒకరు మృతి
మరో యువకుడికి తీవ్రగాయాలు ఆస్పత్రికి తరలింపు



నవతెలంగాణ-మహదేవ్‌పూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మ హదేవపూర్ మండలం కాళేశ్వరం అంతరాష్ట్రవంతెన సమీపంలో శనివారం సాయంత్రం ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో కన్నెపెల్లి గ్రామానికి చెందిన పిట్టల శేఖర్ (17) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, పిట్టల బాలాజీ (18) అనే యువకునికి తీవ్రగాయాలు కాగా108 లో ఆసుపత్రికి తరలించారు. ఎస్సై లక్ష్మణ్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ బాలాజీనీ మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుద్ఘాతానికి దుక్కిటెద్దు మృతి



నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో రూ.80వేల విలువగల దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని చిన్న తూండ్ల గ్రామ పరిధి పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శని వారం చోటు చేసు కుంది. ఎద్దు యజమాని పులిగంటి రాజశేఖర్ పూర్తి కథనం ప్రకారం ఎద్దును ఉదయాన్నే మేతకు వదిలినట్లుగా, ఎద్దు మేస్తూ ప్రమా దకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే చనిపోయినట్లుగా కన్నీరు మున్నీరయ్యాడు. అసలే ఖరీఫ్ సీ జన్ వ్యవసాయ పనులు జోరందుకున్న నేపథ్యంలో తనఎద్దు చనిపోయి కుడి భుజం ఇరిగినంత పనైపోయిందని, ప్రభుత్వం, విద్యుత్‌శాఖ అధికారులు ఆర్థికంగా ఆదుకోవాలని విన్నవించాడు.

విద్యుత్ అధికారులు మొద్దు నిద్ర వీడాలి

ఈట్రాన్స్‌ఫార్మర్ చాలా ప్రమాదకరంగా ఉందని, ఇప్పటికే నాలుగైదు మూగజీవాలు మృత్యువాత పడ్డాయని, ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తు పెంచాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ పులిగంటి మమత, నర్సయ్య, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు మొద్దునిద్రను వీడి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సరి చేయాలని కోరుతున్నారు.

సమ్మెబాటలో సఫాయి కార్మికులు
జీపీ పారిశుధ్య విధుల్లో గ్రామ సర్పంచ్



నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మండల కేంద్రంలో సర్పంచ్ శ్రీపతిబాపు జీపీ ట్రాక్టర్ డ్రైవర్ అవ తారం ఎత్తారు. తానే స్వయంగా ట్రా క్టర్ నడుపుతూ మేయిన్ రోడ్డు లోని షాపుల నుండి చెత్తను సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మి కులు సమ్మెబాట పట్టడం, జీపీ కార్మి కులు సమ్మెలో ఉండటంతో గ్రామంలో పారి శుధ్య విధులు లోపించకుండా శనివా రం ట్రాక్టర్‌తో మేమే స్వయంగా చెత్తను సేకరించామని సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు. గ్రామ పరిశుభ్రతనే మాప్రథమ కర్తవ్యంగా మేము గెలిచిన రోజు నుండి నేటివరకు అదే ఉత్సాహంతో పని చేస్తు న్నామన్నారు.

సఫాయికార్మికుల జీతాలు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, రాష్ట్రం వచ్చాక కార్మికుల జీతాలను రెండింతలు చేసి, అదనంగా మరోవేయి రూపాయలు పెంచిన గొప్ప మనసున్న ప్రభుత్వం మనదే నని గుర్తుచేశారు. మీకు దండం పెడుతాం మీరు ట్రాక్టర్ తీయద్దు సమ్మెకు సహ కరించాలని సమ్మెలో ఉన్న కార్మికులు విన్నపించారు. సర్పంచ్‌గా నా బాధ్యతలు నేను నిర్వర్తించాల్సి ఉంటుందని, ప్రజలకు సేవ చేసేందుకే నన్ను ప్రతినిధిగా ఎన్నుకున్నారన్నారు.

మంథనిలో జనసేన పార్టీని బలోపేతం చేస్తాం
నియోజకవర్గ ఇంచార్జీ మాయ రమేష్

నవతెలంగాణ-కాటారం

మంథని నియోజక వర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేస్తామని మంథని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మాయ రమేష్ పిలుపునిచ్చారు. కాటారంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో కాల్వరాజశేఖర్, చినుముల శివప్రసాద్, వంగల శ్రీనివా స్‌చారి, జనగామ పవన్, కుమ్మరి వెంకటేష్, విజ్జగిరి రమేష్ పంజా, శేషాజ్వల రాజేష్, కల్లూరి ఉదయ్, ఆత్కూరి రంజిత్, కొండేటి వంశీ పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో మాక్ అసెంబ్లీ ఎన్నికలు



నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో విద్యార్థినీ విద్యార్థులకు మాక్ అసెంబ్లీ, ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పురం భూపాల్ రెడ్డి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు మాక్ అసెంబ్లీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. పాఠశాలలో హెడ్ బాయ్ హెడ్ గర్ల్ సాంస్కృతిక విభాగం క్రీడా విభాగం ఇన్చార్జిలను విద్యార్థులు ఓటు పద్ధతిలో ఎన్నుకున్నట్లు తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు సామాజిక ధృక్పథం కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులకు సామాజికంగా అన్ని రంగాలలో అవగాహన కల్పించేందుకు ప్రతినెల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రీతి రెడ్డి, కరస్పాండెంట్ ఆవుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మల్లికార్జున్, పరశురాం, సత్తార్, వెంకన్న, శేఖర్, ఉమా, మౌనిక, ఏస్తారు కప నవ్య, స్వరూప రాణి, నేవితా, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వివేకవర్ధిని పాఠశాలలో బోనాల పండుగ



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండలంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో శనివారం ముందస్తు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టు చీరలు, నగలు ధరించి తలపై బోనం మోస్తూ రావడం ఆకట్టుకుంది. కొంతమంది విద్యార్థులు ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాలికి గజ్జలు కట్టుకొని పోతరాజు వేషధారణతో డప్పు చప్పుల్లకనుగుణంగా నృత్యం చేయడం జరిగింది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ భోజనం అనే పదానికి వికృతి పదం బోనం అని, కొత్తకుండలో వంట చేసుకొని భక్తులు ప్రదర్శనగా వెళ్లి గ్రామదేవతలకు బోనం రూపంలో సమర్పిస్తారన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఆషాడ మాసంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తారన్నారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గులాబీ తోటలో తిరుగుబాటు

ఉద్యమకారుల ప్రతిఘటన - శంకర్ నాయక్ టికెట్ ఇవ్వద్దు - కార్యకర్తలను ఉద్యమకారులను హేళన చేశాడు - ఎమ్మెల్సీ వర్సెస్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మహబూబాబాద్

గులాబీ గూటిలో నిరసన ప్రారంభమైంది. ఉద్యమకారులు ప్రతిఘటిస్తున్నారు. పార్టీ శ్రేణులు తిరుగుబాటు జెండా ఎగరవేశారు. మహబూబాబాద్ నియోజకవర్గ కేంద్రంగా ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ టికెట్ ఇవ్వద్దంటూ పార్టీ శ్రేణులు ఉద్యమకారులు నిరసన గళం ప్రారంభించారు. గత తొమ్మిదేళ్లుగా అణిగిమణి ఉన్న కార్యకర్తలు ఒక్కసారిగా ప్రతిఘటనకు సిద్ధమయ్యారు. ఉద్యమకారులు పార్టీ శ్రేణులు అందరి నినాదం ఒక్కటే ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌కు టికెట్ ఇవ్వద్దు. ఇంతకాలం గులాబీ గూటిలో అసంతృప్తి నివురు గప్పిన నిప్పులా ఉండగా ఒకేసారి బద్దలైంది. గతంలో శంకర్ నాయక్ మీద అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ పార్టీ కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు నోరు విప్పలేదు సరి కదా ఎమ్మెల్యేకు అనుకూలంగా ప్రకటనలు జారీ చేశారు. కానీ ఇక కార్యకర్తలు ముసుగులో గుద్దులాట విడిపోయారు. బహిరంగంగా వేదిక ఎక్కి శంకర్ నాయక్ ఉద్యమ ద్రోహి అంటూ నినాదాలు చేస్తున్నారు. ఆయనకు టికెట్ ఇస్తే ఉద్యమకారులకు పాతవి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో గతంలో ఎంపీ మాలోతు కవిత వర్సెస్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ కేంద్రంగా అనేక సందర్భాలలో రభస జరిగింది. ఇప్పుడు కొత్తగా ఎమ్మెల్యే శంకర్ నాయక్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు వర్గీయులు రోడ్ ఎక్కారు. ప్రధానంగా ఎమ్మెల్సీ రవీంద్రరావు వర్గీయులు మహబూబాబాద్ మండలంలోని ఒక మామిడి తోటలో సమావేశమయ్యారు. వారి రహస్య సమావేశం కాస్త బట్టబయలైంది. దీంతో మీడియా మామిడి తోటకు వెళ్లగా వారు నోరు విప్పారు. బాహాటంగానే పత్రికా ముఖంగా శంకర్ నాయక్ ఉద్యమ ద్రోహి ఆయనకు టికెట్ ఇవ్వొద్దంటూ ప్రకటించారు. ఈ సందర్భంగా మామిడి తోట సాక్షిగా మహబూబాబాద్ టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జర్రిపోతుల వెంకన్న మాట్లాడారు. 2014 ఎన్నికలలో శంకర్ నాయక్ ఎవరో కేటీఆర్, కేసీఆర్, హరీష్ రావులకు తెలియదన్నారు. పక్కన రవీందర్‌రావు దగ్గర ఉండి ఎమ్మెల్యే శంకర్ నాయకుని కేసీఆర్ ముందు నిలబెట్టి టికెట్ ఇప్పించారని తెలిపారు. అప్పుడు కూడా శంకర్ నాయక్ టికెట్ ఇవ్వడం వారికి ఇష్టం లేదన్నారు. రవీందర్‌రావు పట్టు పట్టి టికెట్ ఇవ్వాలని తాను గెలిపించి తీసుకొచ్చి మీకుఅప్పజెప్తానని మాట ఇచ్చాడని తెలిపారు. ఆ ఎన్నికల్లో ఉద్యమకారులు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తక్కెళ్ల పల్లి రవీందర్‌రావు అందరు కలిసి కాలికి బలపం కట్టుకొని సొంత ఖర్చులు పెట్టుకొని పార్టీ గెలుపే లక్ష్యంగా రాత్రి పగలు పనిచేశామన్నారు. కానీ గెలిచిన నాటి నుండి ఎమ్మెల్యే శంకర్ నాయక్ పార్టీ శ్రేణులను ఉద్యమకారులను విస్మరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. శంకర్ నాయక్ ఏ ఒక్క పార్టీ కార్యకర్తలను ఉద్యమకారుని ఆదుకోలేదన్నారు. ఉద్యోగుల బదిలీలు రాజకీయ సెటిల్మెంట్లో భూకబ్జాలలో మునిగి పోయాడని ఎవరికి ఎలాంటి సహాయం చేయలేదని పార్టీని పట్టించుకోలేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, ప్రజలు వ్యాపార వర్గాల్లో శంకర్ నాయక్ పై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలను శంకర్ నాయక్ వేధించాడని తెలిపారు. ఈసారి శంకర్ నాయక్ టికెట్ ఇవ్వద్దని కొత్త వ్యక్తి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మామిడి తోటలో సమావేశమైన వారిలో మానుకోట మున్సిపల్ కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, కౌన్సిలర్ హరి సింగ్, కో ఆప్షన్ సభ్యులు నిమ్మల శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు ఎడ్ల రమేష్, చిట్టోజు రవీంద్ర చారి, మంగ శంపల్లి కన్నా, టిఆర్ఎస్ నాయకులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, మాదరబోయిన యాకన్నతోపాటు మాజీ కౌన్సిలర్లు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ తోనే సర్వ మతాలకు ఆదరణ

పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడు డేవిడ్ రాజ్



నవతెలంగాణ-పెద్దవంగర

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలోని సర్వ మతాలకు ప్రత్యేక ఆదరణ లభిస్తుందని పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడు కండె డేవిడ్ రాజ్ అన్నారు. మండలంలోని పెద్దవంగర, చిట్యాల, గంట్లకుంట, కొరిపల్లి గ్రామాల్లోని చర్చిల్లో మౌలిక వసతుల కల్పన కోసం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎస్డీఎఫ్ నిధుల నుంచి ప్రతి గ్రామానికి 5 లక్షల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేశారు. దీనిని హర్షిస్తూ క్రిస్టియన్ సోదరులు శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హిందూ, క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం సర్వ మతాలను సమానంగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. మంత్రి ఎర్రబెల్లి చర్చిల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం మండల నాయకులు జలగం జాషువా, వెంకట రత్నం, సుధాకర్, చింతల ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి : రామకృష్ణ



నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన ఉద్యమకారులను ఆదుకోవాలని ఉద్యమకారుడు పుచ్చకాయల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లోని స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో శనివారం తెలంగాణ ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మానుకోట బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ కారులంతా కోరుకునేది కేసీఆర్ అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులను విస్మరించిన వారికి టికెట్లు ఇవ్వొద్దని కోరారు. టికెట్లు ఇచ్చే విషయంలో కేసీఆర్ ఒకటి రెండు సార్లు ఆలోచించాలని కోరారు. ఉద్యమకారులకు ద్రోహం చేసిన వారికి టికెట్లు ఇవ్వద్దన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ ఖాన్, చంద్రారెడ్డి, ఖయ్యుం, ఖైరంకొండ రాము, చెక్కల అశోక్ పాల్గొన్నారు.

కేసముద్రం మండల అధ్యక్షుడుకి ఘనంగా సన్మానం



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండలం కేంద్రంలో టిపిసిసి ఉపాధ్యక్షులు వేం నరేందర్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్, తెలంగాణ ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావుని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు దస్రు నాయక్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నునావత్ రాధా, డిసిసి ఉపాధ్యక్షులు యాదవ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బండారి వెంకన్న, కల్వల సర్పంచ్ గంట సంజీవరెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షులు మేకల వీరన్న యాదవ్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు, బండారు దయాకర్, బెరువాడ సర్పంచ్ ముదిగిరి సాంబయ్య, దనసరి ఉపసర్పంచ్ చిన్న వెంకన్న, తరాల సుధాకర్, బోడ విక్కి, విలేజ్ గ్రామ ప్రెసిడెంట్ మాసడీ శీను, పెరుమండ్ల ఏల్లా గౌడ్, చిట్ల సంపత్, కొండ సురేష్, అల్లం గణేష్, ముజ్జు, అజిత్ రెడ్డి, సేవల్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ-తొర్రూరు

సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ తొర్రూర్ మండల అధ్యక్ష, కార్యదర్శి ఈదురు అజిత్, మహమ్మద్ అమీర్‌లు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ అధికారంలోకి వస్తే కేజీ టు పీజీ ఉచిత విద్య అమలు చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 3500కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్లు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడిని నివారించడంలో ప్రభుత్వం విఫలమైంది అని విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కరం కై జరిగే ఈ బంద్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం జిల్లా నాయకులు జ్యోతి, మహేష్, ప్రశాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గిరిజన యూనీవర్సిటీ కోసం పోరాడుతాం : ఏఐఎస్ఎఫ్



నవతెలంగాణ-ములుగు

ఆదివాసీ, గిరిజన విద్యార్థుల ఉన్నత విద్య కోసం ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్ డిమాండ్ చేశారు. మేడారం సమ్మక్క-సారలమ్మ వద్ద వున్న గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొత్కు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి సాగర్‌లతో కలిసి సందర్శించిన రెహమాన్ విద్యార్థినిలతో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో యూనివర్సిటీల ప్రాధాన్యత పై వారితో చర్చించారు. అనంతరం వారితో కలిసి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు వ్యతిరేకంగా, తెలంగాణ విభజన హామీలను అమలు చేయాలని, ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. భవిష్యత్తులో గిరిజన యూనివర్సిటీ కోసం సమ్మక్క- సారలమ్మ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సొత్కు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి సాగర్, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి జోసెఫ్, శ్రీను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులు

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని వాడగూడెం శ్రీసమ్మక్క-సారలమ్మ ఇసుక క్వారీ ర్యాంపు నుండి సిద్దిపేటకు చెందిన శంకర్ అనే కాంట్రాక్టరు అతని వద్ద పని చేసిన మంచర్ల మురళిలు సుమారు కోటీ 50 లక్షల విలువ చేసే ఇసుకను తరలించి సొసైటీ సభ్యులకు లెక్కలు చూపించకుండా తమను బెదిరిస్తునారని శ్రీ సమ్మక్క-సారలమ్మ గిరిజన ఇసుక సొసైటీ అధ్యక్షుడు వాసం మల్లయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. సొసైటీ మంజూరీ నుండి అధ్యక్షుడుగా ఉన్న తనకు ఎలాంటి లెక్కలు చూపకుండా ఇసుకను తరలించారని రెంప సారి సైతం ఇసుక క్వారీ మంజూరీలో మండలానికి చెందిన గిరిజనేతరులతో సొసైటీ సభ్యులను మచ్చిక చేసుకుని తనకు తెలియకుండా ప్రశ్నించే తనను సొసైటీ అధ్యక్షుడుగా మార్చాలని కుట్రలు చేస్తున్నారని మల్లయ్య ఆరోపించారు. పెసా నిబంధనలకు విరుద్దంగా ఇసుక కాంట్రాక్టర్లు కోట్లాది రూపాయల ఇసుకను గిరిజనులకు తెలియకుండా జేసీబీలు, టిప్పర్లు, లారీలతో ఇసుకను గోదావరి నుండి రాంపులకు తరలిస్తూ గిరిజనులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వీరికి టీఎస్ఎండీసీ, రెవిన్యూ అధికారులు అండగా ఉండడంతో ఇసుక కాంట్రాక్టర్లు అక్రమాలు అడ్డఅదుపు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై కలెక్టర్, ఐటీడీఏ పీఓ, తహసీల్దార్‌లకు శనివారం ఫిర్యాదు చేసినట్లు మల్లయ్య ప్రకటనలో తెలిపారు.

ముందస్తు అరెస్టులు అక్రమం



నవతెలంగాణ-మంగపేట

హన్మకొండ జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా మండలంలోని పలు రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అక్రమమని బీఎస్పీ ములుగు అసెంబ్లీ ప్రెసిడెంట్ ఎంపెల్లి వీరాస్వామి, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ గుగ్గిల్ల సురేష్, తుడుందెబ్బ జిల్లా నాయకుడు కబ్బాక శ్రావన్ కుమార్‌లు ఆరోపించారు. ఈ అరెస్టులను బహుజన్ సమాజ్ పార్టీ, ప్రజాసంఘాలు ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

గిరిజన యూనివర్సిటీ నెలకొల్పుకుంటే...

ఆ స్థలాన్ని బీజేపీ నాయకుల స్మృతివనంగా ప్రకటించాలి

337 ఎకరాల జాగ ఇచ్చినాం...

నాయకులు అబద్ధాలు అడరాదు...

యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్

నిరహార దీక్షలో సీతరాం నాయక్



నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లాలోని జాకారం ఏరియాలో నెలకొల్పు తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటుచేయకుంటే ఆస్థలాన్ని బీజేపీ నాయకుల స్మృతి వనంగా ప్రకటించాలని మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ఆజ్మీరాసీతరాం నాయక్ అన్నారు. ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ, కేయూ విద్యార్థులతో కలిసి ములుగు గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ గతంలో గిరిజనయూనివర్సిటి ఏర్పాటులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపు నఅన్ని విధాల సహకరిస్తూ 337 ఎకరాల భూమిని గిరిజన యూనివర్సిటి కోసం కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం జరిగిందన్నారు. ఈవిషయాన్ని మరిచిపోయిన బీజేపీ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ భూమి కేటాయింపు రాష్ట్ర ప్రభుత్వం జరుగలేదనడం సిగ్గుచేటన్నారు. ఈ రోజు వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన మోదీ ప్రసంగాన్ని మేడారం సమ్మక్క సారలమ్మలతో మొదలు పెట్టి ఆ జాతరకు జాతీయ హోదా, అదే జిల్లాలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం గురించి మాట్లాడక పోవడం దౌర్భాగ్యమన్నారు. వరంగల్ జిల్లాకువచ్చిన మోదీ తన ప్రసంగంలో ఎటువంటి హామీలు ఇవ్వకుండా వెళ్లి పోవడం కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు. అబద్ధాలు ఆడే బిజెపి నాయకులకు తెలంగాణ ప్రజలు రానున్న ఎన్నికలలో బుద్ధి చెప్తారన్నారు. గిరిజన యూనివర్సిటీ, మేడారం సమ్మక్క సారలమ్మల జాతయహోదా, కోచ్ ప్యాక్టరీ వంటివి విభజన చట్టంలోని న్యాయమైన కోరికలు కాబట్టే ఈ రోజు తెలంగాణ ప్రజలు వాటిని తమ హక్కుగా అడుగుతున్నారని వాటిని నెరవేర్చకుండా తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపించడం దారుణమన్నారు. ఈ దీక్షను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ములుగు జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతిలు దీక్ష నిర్వహించిన సీతారాం నాయక్ తదితరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

రానున్న పార్లమెంట్ సమావేశాల్లో పట్టుపడుతాం : ఎంపి మాలోతు కవిత

రానున్న పార్లమెంట్ సమావేశాలలో ములుగు జిల్లాలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గిరిజన పక్షపాతులు అయిన వివిధ రాష్ట్రాలు పార్లమెంట్ సభ్యులను కూడబెట్టుకుని విశ్వవిద్యాలయ ఏర్పాటుకు తమవంతుగా పట్టుబడుతామని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోతు కవిత అన్నారు. యూనివర్సిటి కోసం జిల్లాలో 337 ఎకరాల భూమి ఇచ్చినప్పటికి యూనివర్సిటి ప్రారంభం కాకపోవడంలో ఆంతర్యం ఏమిటని అన్నారు. యూనివర్సిటి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పని మొత్తం పూర్తి చేసిందన్నారు.

ఇస్తారా ఇవ్వరా తేల్చాలి...ములుగు జిల్లా ప్రజలు ఏం పాపం చేశారు : జడ్పీ బడే నాగజ్యోతి

అసలు ములుగు జిల్లాకు గిరిజన యూనివర్సిటి ఇచ్చే ఉద్దేశ్యం కేంద్ర ప్రభుత్వానికి ఉందా..? అని ఆ మె కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న గిరిజన విద్యార్థుల కళల స్వప్నమైన కేంద్రీయ విశ్వ విద్యాలయాన్ని ములుగు జిల్లాలో ఏర్పాటు చేస్తారా..? చేయ్యరా..? అనే విషయాన్ని నరేంద్ర మోడీ స్పష్టం చేయాలని అన్నారు.

రానున్న రోజులలో ట్రైబల్ యూనివర్సిటి సాధించడం తథ్యం : ఎమ్మెల్యే గండ్ర

రానున్న రోజులలో మాజీ ఎంపి ఆజ్మీరా సీతారాం నాయక్‌తో కలిసి పోరాటాన్ని ముమ్మరం చేసి ట్రైబల్ యూనివర్సిటి సాధించడం తథ్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను అమ్ముకున్న ఘనత మోడీ అని అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. మోడీ సభకు కేసీఆర్ రాలేదని బిజెపి నాయకులు అనడం సిగ్గు చేటని సిఎం కేసీఆర్ కమిట్ మెంట్ ఉన్నవ్యక్తి కాబట్టి మోడీ సభకు హాజరు కాకుండా ప్రజల ఆకాంక్షను తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ నాయకులు భూక్య అమర్ సింగ్, విష్ణు, రాజు, వెంకన్న స్వామినాయక్, రాజేందర్, రమేష్, ప్రశాంత్, రవీందర్ నాయక్, ఉస్మానియా యూనివర్సిటి విద్యార్థి నాయకులు రవి రాథోడ్, సేవాలాల్ సేనా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు సంతోష్ నాయక్, రాహుల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, భూపాలపల్లి రైతు బందు సమితి అధ్యక్షులు పల్లా బుచ్చయ్య, బీఆర్ఎస్ నాయకులు ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, కొత్తగూడ, గంగారం మండల అధ్యక్షులు బాదం ప్రవీణ్, రమణారెడ్డి, సాయి కుమార్, గడదాసు సునిల్‌కుమార్, సుబ్బుల సమ్మయ్య, కుడుముల లక్ష్మీ నారాయణ, వేణు యాదవ్, వేణు యాదవ్, సూరయ్య, ములుగు జడ్పీటిసి భవాని, గోవిందరావు పేట జెడ్పీటిసి తుమ్మల హరిబాబు, వెంకటాపూర్ జెడ్పీటిసి రుద్రమదేవి అశోక్, కోఆప్షన్ సభ్యురాలు వలీయాబి, గోవిందరావుపేట, ఏటూరునారాం ఎంపిపిలు సూడి శ్రీనివాస్‌రెడ్డి, అంతటివిజయ, పోరిక విజయ్‌రాం నాయక్, మహేష్, ములుగు టౌన్ ప్రెసిడెంట్ విజయ్, కోగిల మహేష్, గజ్జి నగేష్, నాయకులు మల్క రమేష్ పాల్గొన్నారు.

పొన్నాలను విమర్శిస్తే ఊరుకోం



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

నాయకులుగా ప్రచారం చేసుకుంటున్న కొంతమంది స్థాయి లేకపోయినా మాజీ పీసీసీ పీసీసీ అధ్యక్షులు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యను విమర్శిస్తున్నారని, ఆయనను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. శనివారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో జిల్లా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మన్‌సాన్‌పల్లి లింగాజీ, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు జక్కుల వేణుమాధవ్ తదితరులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బీసీలకు సేవ చేసిన పొన్నాల లక్ష్మయ్య విమర్శించడం విడ్డురంగా ఉందన్నారు. గతంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్గా, జిల్లా పరిషత్ జెడ్పిటిసిలుగా, ఎంపీటీసీలుగా, సర్పంచులుగా కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర స్థాయి పదవులు, నామినేట్ పదవుల్లో ఎక్కువ మంది బీసీలకు అవకాశం ఇచ్చిన ఘనత పొన్నాలదేనన్నారు. గతంలో కంటే ఆయన పిసిసి అధ్యక్షులు ఉన్న సమయం ఎలక్షన్లలో అత్యధిక శాతం బీసీలకు టికెట్లు ఇచ్చారన్నారు. రెండు రోజుల క్రితం పొన్నాలను విమర్శించిన వారు ఆయన పుణ్యాన్నే మున్సిపల్ వైస్ చైర్మన్ అయ్యారు అనే విషయం గుర్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి పదవులు అనుభవించిన వారు కృతజ్ఞత లేకుండా ఆయనను విమర్శించడం సరైన పద్ధతి కాదని, కొంతమంది పార్టీ నుండి సస్పెండ్ అయి మూడు సంవత్సరాలుగా పార్టీకి దూరంగా ఉన్న వ్యక్తులు, పార్టీలో ఉన్నారో లేదో కూడా తెలియని వ్యక్తులు కూడా పొన్నాల గురించి మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు లోకుంట్ల ప్రవీణ్, రాష్ట్ర నాయకులు మల్లేష్, సీనియర్ నాయకులు కట్ట కృష్ణ, రంగు రవి, జాఫర్ షరీఫ్, సుల్తాన్ గోవిందర్ రెడ్డి, పిట్టల రాజు, నోముల రాజు, మర్తల ప్రభాకర్, కొండ శీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హత్య చేసిన నిందుతుడు అరెస్ట్



నవతెలంగాణ-వాజేడు

భూమి వివాదం విషయంలో అన్నను హత్య చేసినటువంటి నిందితుడు మోడం శివాజీని శనివారం నమ్మదగిన సమాచారం మేరకు వెంకటాపురం ఇన్చార్జి సీఐ ఎం.రాజు (ఏటూరునాగారం సిఐ) ఆధ్వర్యంలో ఎస్సై వాజేడు రేఖ అశోక్ తన సిబ్బందితో కలిసి గుమ్మడిదొడ్డి పెట్రోల్ బంకు సమీపంలో నిందితుని అదుపులోకి తీసుకోని ఇద్దరు పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించగా నిందితుడు తన తల్లిదండ్రులు సంపాదించిన ఒక్క ఎకరం భూమి మొత్తాన్ని నాకు ఇవ్వకుండా నా అన్నయ్య తీసుకోవాలని ప్రయత్నించినట్లు, అందులో భాగంగానా తల్లిదండ్రులను నన్ను తరచూ మద్యం సేవించి కొడుతూ ఉండేవాడని, ఎలాగైనా అన్న బాధ నుంచి తప్పించుకోవడానికి నా దగ్గర ఉన్నటువంటి కత్తితో మా అన్నను హతమార్చినట్లు, హత్య అనంతరం కత్తిని తన ఇంట్లో దాచినట్లు పంచుల సమక్షంలో తెలపగా, అట్టి కత్తిని స్వాధీన పరుచుకొని నిందితుడిని పోలీస్ స్టేషన్ తరలించి రిమాండ్ నిమిత్తం ములుగు కోర్టు నందు హాజరుపర్చినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

పేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం

2 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



నవతెలంగాణ-జనగామ

తెలంగాణ రాష్ట్రంలో పేదలకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. జనగామ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బిర్రు నాగరాజు రోడ్డు ప్రమాదంలో మరణించగా బీఆర్ఎస్ పార్టీ నుండి మంజూరైన రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి శనివారం జిల్లా కేంద్రంలో మృతుడు నాగరాజు భార్య బిర్రు కవితకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకుంటుందన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నాగరాజు, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్



నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరసన కార్యక్రమం ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యల వలన విద్యార్థులు సతమతమవుతున్నారని, విద్యాసంవత్సరం ప్రారంభమై దరిదాపుగా 28 రోజులు పైబడి అయిన విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించడంలో విఫలమైందని, సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్ బుక్స్ అందించాలని, విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు టాయిలేట్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన గదులు కూలగొట్టి, వాటి స్థానంలో నూతన గదులు నిర్మించాలి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చాలీచాలక నిధులతో మధ్యాహ్న భోజనం పెడుతున్నారని భోజనం నాణ్యత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అధిక నిధులు కేటాయించి నాణ్యత భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరే లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండ మట్టి పోయించాలని అన్నారు. తక్షణమే ఈ విషయాలపై స్పందించి విద్యార్థులకు న్యాయం చేకూర్చే గలగాలని లేనియెడల పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా ఆందోళన కార్యక్రమాన్ని పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, ప్రదీప్, రాజేష్, హేమంత్, జగన్, ప్రణయ్, ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జగదీష్ కుటుంబానికి నామినేటెడ్ పదవి ఇవ్వాలి

బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు మొర్రి రాజు యాదవ్

నవతెలంగాణ-ములుగు

దివంగత జడ్పీ చైర్మన్ జగదీశష్ కుటుంబానికి నామినేటెడ్ పదవి ఇవ్వాలనీ బిఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు మొర్రి రాజు యాదవ్ సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగదీష్ తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ వెంట నడిచి తెలంగాణ రాష్ట్ర సాధనలో పాలుపంచుకున్న ములుగు జెడ్పీ చైర్పర్సన్, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దివంగత నేత కుసుమ జగదీశ్ అకాలమరణం జిల్లా ప్రజలకు పార్టీకి తీరని లోటని, ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా నియమించిన కెసిఆర్ ఆదేశం మేరకు జిల్లాలో పార్టీని కార్యకర్తలను ఒక్క తాటిపై నిలిపి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ జిల్లాలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడానికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. జగదీశ్ అకాల మరణంతో కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటూ కోటిన్నర రూపాయలను కుటుంబానికి ఇవ్వాలని నిర్ణయించిన ఐటీ పురపాలక శాఖా మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహణ అధ్యక్షులు కేటీఆర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జగదీశ్ అన్నా అకాల మరణంతో ఆ కుటుంబాన్ని కూడా రాజకీయంగా ఆదుకోవాలని, వారి కుటుంబంలో ఒకరికి ఏదైనా నామినేటెడ్ పదవి ఇచ్చి రాజకీయ భరోసా ఇవ్వాలని సీఎం కెసిఆర్, పార్టీ కార్యనిర్వాహణ అధ్యక్షులు కేటీఆర్‌ని కోరారు.

పాత పోలీస్‌స్టేషన్‌లోనే సేవలు అందించాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్



నవతెలంగాణ-ములుగు

పాత పోలీస్ స్టేషన్‌లోనే ప్రజలకు పోలీస్‌సేవలు అందించాలనీ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ పోలీస్ ఉన్నత అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ములుగు మండల ముఖ్య నాయకుల సమావేశం డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కలువల రవీందర్ అధ్యక్షతన శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ సౌకర్యాలు సేవలు అనేవి ప్రజలకు అందుబాటులో ఉండాలని పేద మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడే విధంగా ఉండకూడదని, జిల్లా కేంద్రంలో పాత పోలీస్ స్టేషన్ బస్టాండ్ దగ్గరలో ఉన్న స్టేషన్ అందుబాటులో ఉన్నదనీ ఇక్కడే ప్రజలకు పోలీస్ సేవలు అందించాలని కొత్త పోలీస్ స్టేషన్ కొంత దూరంగా లోపలికి ఉండడం వల్ల బస్సుల్లో ఆటోల్లో వచ్చే ప్రయాణికులు స్టేషన్‌కు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు అధికారులు ఆలోచించి పోలీస్ సేవలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పాత పోలీస్ స్టేషన్లోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు చంటి సునీల్, వినోద్, అర్జున్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు రాజ్యాంగ విరుద్ధం

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ



నవతెలంగాణ-గోవిందరావుపేట

ముందస్తు అరెస్టులు రాజ్యాంగ విరుద్ధమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకట కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పసర పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల నిర్బంధంపై మాట్లాడారు. ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా అవినీతి, అక్రమాలను అడిగితే అక్రమ కేసులా..?ఇది ప్రజాస్వామ్యమా లేక కీచక రాజ్యమా..? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ పై పరువునష్టం దావా కేసులో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అసహనం వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపడతారని ముందస్తు పోలీసులు అరెస్టులు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మోడీ లంతా కేడిలే అన్నందుకు రాహుల్ గాంధీ పై సూరత్ జిల్లా కోర్టులో పరువునష్టం దావా కేసు వేస్తూ బీజేపీ ఎంపీ పిటిషన్ దాఖలు చేయగా అట్టి పిటిషన్ విషయంపై గుజరాత్ హైకోర్టుకి స్టే ఇవ్వాలని కోరగా అక్కడ కూడా చుక్కెదురైంది. గుజరాత్ జిల్లా కోర్టు ఇచ్చిన అక్రమ తీర్పుపై న్యాయ పోరాటం చేయకుండా మమ్మల్ని పోలీసులు అడ్డగించడం అప్రజాస్వామికం అని, ప్రజాస్వామ్యంలో పోరాటం చేసే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అక్రమ అరెస్టులు మా పోరాటాన్ని ఆపలేవన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి మండల ఇంచార్జి కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులు తేళ్ల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింత క్రాంతి, పస్రా గ్రామ ఉపసర్పంచ్ బద్దం లింగారెడ్డి, పంగ శ్రీను, జక్కు రణదీప్, పత్రి మధు, ఎట్టి ప్రవీణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ప్రయోజకుడు కావాలి



నవతెలంగాణ-కొత్తగూడ

చదువులోనే కాకుండా క్రీడలలోను ప్రతిభ కనబరిచి ప్రతి విద్యార్థి ఓ ప్రయోజకుడు కావాలని గిరిజన ఆశ్రమ బాలుర క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోలెం దేవదాస్ అన్నారు. హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలలో ప్రవేశం కోసం శనివారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఎంపిక పోటీలను ప్రధానోపాధ్యాయులు దేవదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సువర్ణపాక సుబ్బారావు, పిడి విజయలలిత, పీఈటి ప్రవీణ్, పుష్పలీల, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా సమగ్ర స్వరూపం కోసం ...

రచనలకు ఆహ్వానం : అమ్మిన శ్రీనివాసరాజు

నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లా సమగ్ర స్వరూపం కోసం రచనలకు ఆహ్వానం పలుకుతున్నామని జిల్లా కన్వీనర్ అమ్మిన శ్రీనివాసరాజు తెలిపారు. తెలంగాణ సరస్వతి పరిషత్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని 33 జిల్లాల సమగ్ర చరిత్రలను సేకరించి పుస్తకాలుగా ప్రచురిస్తుంది. అందులో భాగంగా ములుగు జిల్లా సమగ్ర స్వరూపం ప్రచురణకు పూనుకుంది. జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన ప్రాచీన చరిత్ర ఉద్యమాలు కలలు సాహిత్యం, వ్యవసాయం, విద్యా, వైద్యం, ఆధ్యాత్మిక విశేషాలకు చెందిన వ్యాసాలను పంపాల్సిందిగా జిల్లా కన్వీనర్ అమ్మిన శ్రీనివాసరాజు శనివారం తెలిపారు. మొత్తం 28 రంగాలకు సంబంధించిన వ్యాసాలను రాసి జులై 31లోగా 7729883223 వాట్సాప్ నెంబర్‌కు పంపించాలని ఆయన తెలిపారు. ములుగు జిల్లాకు చెందిన రచయితలంతా సకాలంలో సమాచారం అందించి భావితరాలకు ఉపకరించే ఈ బృహత్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే సీతక్క జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ములుగు

కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క పుట్టిన రోజు వేడుకలను జిల్లా కేంద్రంలో గాంధీ పార్క్ వద్ద కేక్ కట్ చేసిన అనంతరం మహా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు ఎండి చాంద్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్స్ అకుతోట చంద్రమౌళి, నల్లెళ్ళ భరత్ కుమార్‌లు శనివారం తెలిపారు. ఈ వేడుకలకు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘం చైర్మన్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

గోవిందరావుపేట : నేడు మండల కేంద్రంలో ఎమ్మెల్యే సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో వెంకటకృష్ణ మాట్లాడుతూ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద మన ప్రియతమ నేత, ఏఐసీసీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి మరియు ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడును. కావున గోవిందరావు పేట మండలంలోని జిల్లా నాయకులు, మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ అధ్యక్షులు, గ్రామ కమిటీలు, కార్యకర్తలు, యూత్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, సీతక్క అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీస్ అందజేత



నవతెలంగాణ-గార్ల/డోర్నకల్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 2022 మార్చి 15న సీఎం కేసీఆర్ అసెంబ్లీలో 2000 రూపాయలు పెంచుతున్నట్టు ప్రకటించారని నేటికీ వరకు ఆ ప్రకటన ప్రకారం వేతనాలు చెల్లించ లేదని తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ధనలక్ష్మి అన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10,11,12 తేదీలలో చేపట్టనున్న అందోళన సమ్మె నోటిస్‌ను శనివారం విద్యా శాఖ అధికారికి నోటిస్ అందించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నేటి వరకు ఏరియర్స్‌తో సహా చెల్లించేందుకు బడ్జెట్‌ను కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణం ఇవ్వాలని, ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10, 11, తేదీలలో దీక్షలు, 12న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన లక్ష్మి, సకినాల ఉపేంద్ర, సరోజ తదితరులు ఉన్నారు.

సమ్మెలో పంచాయతీ కార్మికులు

చెత్తను సేకరణ చేస్తున్న సర్పంచ్



నవతెలంగాణ-లింగాలఘనపురం

పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపట్టారు. మూడు రోజుల నుండి కార్మికులు గ్రామ పంచాయతీ పారిశుధ్య సింబంది సమ్మెలో ఉన్నారు. గ్రామ సర్పంచ్ కడారు కృష్ణ ఇంటి ఇంటికి ట్రాక్టర్ డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్లి చెత్తనుసేకరించిన సంఘటన మండలంలోని వడ్డిచర్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది.గ్రామంలో వీధుల్లో చెత్త చెదారం పెరుకపోవడంతో సర్పంచ్ స్వయంగా ట్రాక్టర్ తీసుకుని విధుల్లో తిరిగి చెత్తను తీసుకున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు - మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధి లింగం



నవతెలంగాణ-జనగామ

రైతు సంక్షేమమే ధ్యేయంగా టిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్నే సిద్ధి లింగం అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ జనగామ నందు పాలకవర్గ సమావేశం బాల్దె సిద్ధిలింగం అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ సిద్ధిలింగం మాట్లాడుతూ జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు రూ. 5 భోజన వసతి కల్పించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు.అలాగే ఆదోని వ్యవసాయ మార్కెట్‌కు స్టడీ టూర్‌కు వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు అధికారులు వెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం పదోన్నతితో వచ్చిన కార్యదర్శి గ్రేడ్-3 ఎస్.శ్రీనివాస్‌ని ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మూసిపట్ల విజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ పీ. జమున, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె. నాగేశ్వర శర్మ,కమిటీ సభ్యులు, శివరాత్రి రాజ్ కుమార్, నూనెముంతల యాకస్వామి, బసవగాని బాల మల్లేష్, సేవెల్లి మధుసూదన్, గువ్వల రవి,బూశిగంపల ఆంజనేయులు, ధర్మ జయప్రకాశ్ రెడ్డి, అజ్మీర మంగమ్మ, సుదగాని సంజీవ, మాశెట్టి వెంకటేశ్వర్లు, మాశెట్టి అశోక్, కార్యదర్శి గ్రేడ్-3 ఎస్.శ్రీనివాస్, మార్కెట్ పర్యవేక్షకులు బి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కడియం జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



జనహదయ హృదయ నేత కడియం శ్రీహరి అని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ ఎడవెళ్లి క్రిష్ణారెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్ల ఉపాధ్యక్షులు, జిల్లా నాయకులు బెలిదే వెంకన్న అన్నారు. శనివారం ఉమ్మడి ఘన్‌పూర్ మండలంలో మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. డప్పు చప్పుళ్లతో, డీజే, కోలాటాలతో, బాణసంచా పేల్చి, కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, మహిళా కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో వారు మాట్లాడుతూ నియోజక వర్గ అభివృద్ధి కాంక్షించే నాయకుడిగా బడుగు బలహీనర్గాలకు చేయూత నిచ్చిన నాయకుడని కొనియాడారు. తాను రాజకీయ అనుభవంలో దివంగత ఎన్టీఆర్ నుంచి, నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఏ పదవి వరించిన ఆ పదవులకు వన్నె తెచ్చిన గొప్పనాయకుడని అన్నారు. రాబోయే రోజుల్లో నియోజక వర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరేయడంఖాయమన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, బూర్ల శంకర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, పోగుల సారంగపాణి, ఉద్దెమారి రాజ్ కుమార్, లోడెం రజిత రవీందర్, బానోత్ రుప్ల నాయక్, ఎదునూరి రవీందర్, ఎంపిటిసి బూర్ల లతా శంకర్, నీల గట్టయ్య, ఎంపిటిసిలు రజాక్, మారేపల్లి శ్యాం రెడ్డి, మాజీ జెడ్పీటీసీ స్వామి నాయక్, కోతి రాములు, సమ్మయ్య, ఫాతి కుమార్, పులి యాకయ్య, కడియం యువసేన నాయకులు ప్రసాద్, రాజు, విజయ్, సతీష్, వినయ్, దిలీప్, మహేష్, పార్టీ శ్రేణులు, అభిమానులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల శిక్షణతో ఉపాధి అవకాశాలు

ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు



నవతెలంగాణ-పాలకుర్తి

మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తుందని ట్రస్ట్ చైర్ పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు అన్నారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం పాలకుర్తి మండలం విస్నూర్, ఈరవెన్ను గ్రామాల్లో ఎర్రబెల్లి దయాకర్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లపై శిక్షణను ఇచ్చి కుట్టు మిషన్లను అందజేసేందుకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ట్రస్ట్ చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసమే ఈ కుట్టు మిషన్ల శిక్షణను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా ఈ కుట్టు మిషన్ల శిక్షణను సీఎం కెసిఆర్‌ను ఒప్పించి పైలట్ ప్రాజెక్టుగా పాలకుర్తి నియోజకవర్గంలో ప్రవేశపెట్టిన ఘనత మంత్రి దయాకర్ రావుకు దక్కిందన్నారు. పైలెట్ ప్రాజెక్టుతో పాటు నియోజకవర్గంలోని ఆడపరచులందరికీ ఎర్రబెల్లి దయాకర్ రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విడతల వారీగా శిక్షణను అందించి కుట్టు మిషన్లను అందజేస్తామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ కుట్టు మిషన్ల శిక్షణ ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండి.మదార్, రైతుబంధు మండల కన్వీనర్ వీరమనేని యాకాంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కురాంబాబు, కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మాటూరి యాకయ్య గౌడ్,బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, విస్నూరు, ఈరవెన్ను గ్రామాల సర్పంచులు ముసుకు నిర్మల చంద్రబాబు,నకిర్త యాకయ్య బిఆర్ఎస్ మండల పార్టీ కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-గార్ల

గ్రామ పంచాయతీ కార్మికులకు గొడ్డలి పెట్టుగా మారిన జీవో నెంబర్ 51ను సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా జెఎసి అధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్వర్యంలో పట్టణ పురవీధులలో నాయకులు, కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో నిర్ణయించిన మినిమం బేసిక్ 19 వేల రూపాయలను వేతనంగా చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుక వచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రమాదంలో మరణించిన కార్మికులకు 10 లక్షల రూపాయలు నష్టపరిహారాన్ని, పిఎఫ్, ఈఎస్ఐ,ప్రమాద భీమా, గ్రాడ్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కారించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల అప్పిరెడ్డి, సిఐటియు నాయకులు యం.గిరిప్రసాద్, పి.రమేష్, దస్త గిరి, భద్రు, జి.కిషన్, శ్రీను, సిపిఎం, సిపిఐ నాయకులు వి.వెంకటేశ్వర్లు, జె.వెంకన్న తదితరులు ఉన్నారు.

జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుని తల్లి మృతి



నవతెలంగాణ-బచ్చన్నపేట

జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఇర్రి రమణా రెడ్డి మాతృమూర్తి ఇర్రి రాములమ్మ (86) సంవత్సరాలు శనివారం స్వగ్రామం నాగిరెడ్డిపల్లిలో మృతి చెందారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలనీ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం రైతు బంధు సమితి మండల అధ్యక్షులు చల్లా శ్రీనివాస్ రెడ్డి భగవంతుణ్ణి కోరారు. అలాగే వారి అంత్యక్రియలు రేపు అనగా ఆదివారం ఉదయం నాగిరెడ్డి పల్లి గ్రామంలో జరపనున్నట్లు తెలిపారు.

3వ రోజు జీపీ కార్మికుల నిరసనలు

















నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండల గ్రామపంచాయతీ ఉద్యోగుల కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మె నేటికి 3వరోజుకు చేరింది. సమ్మెలో పాల్గొన్న సిబ్బందికి మద్దతుగా అంగన్ వాడి టీచర్స్ రజనీ, నిర్మల, సిఐటియూ మండల కార్యదర్శి జయరాజ్‌లు మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి, కారోబార్ బిల్ కలెక్టర్‌లకు సహాయ కార్యదర్శులుగా నియమిచాలి. ప్రమాదం జరిగిన కుటుంబానికి 10 లక్షల నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలి. జీవో నెం 51 నీ సవరించి మల్టిపర్పస్ విధానం రద్దుచేసి పాత కేటగిరీల వారిగా కొనసాగించాలి అని డిమాండ్ చేశారు. సమ్మెలో అధ్యక్షుడు జాటోత్ మంగిలాల్, ప్రధాన కార్యదర్శి గంధసిరి వెంకటేశ్వర్లు, కొమ్ము ప్రమోద్, బిద్రు, శివ, జాన్సన్, సోని, యాకమ్మ, ఉపేంద్ర, లక్ష్మీ, సుమలత, కవిత, యాకలక్ష్మి, లలిత,సుగుణ మండలంలోని గ్రామపంచాయతీల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ములుగు : గ్రామ పంచాయితీ సిబ్బంది సమ్మె న్యాయమైన పోరాటామని ప్రజా సేవకులు భూక్య దేవ్ సింగ్ తెలిపారు. గత మూడు రోజులుగా జిల్లా కేంద్రంలో అన్ని మండలాల్లోని గ్రామ పంచాయతీల సిబ్బంది, కార్మికులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెకు శనివారం ములుగులో ప్రజా సేవకులు భూక్య దేవ్ సింగ్ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న సిబ్బంది అందరికీ సంఘీభావం తెలిపి అట్టి సమావేశంలో దేవ్‌సింగ్ మాట్లాడుతూ గ్రామ సిబ్బంది చేస్తున్న పోరాటం న్యాయపరమైనదని వారందరినీ ప్రభుత్వం వెంటనే గుర్తించి వారి ఉద్యోగాలకు భరోసా కల్పిస్తూ వారి ప్రధాన డిమాండ్ గ్రామ పంచాయతీలలో పని చేసే సిబ్బంది ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలన్నారు. పట్టుదలతో కార్యక్రమం నిర్వహించి అనుకున్నది సాధించేంత వరకు పోరాడాలని గ్రామ సిబ్బందికి పిలుపు నిచ్చారు. కార్యక్రమానికి సామాజికవేత్త దొంతి విజేందర్ రెడ్డి హాజరై వారికి సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది సభ్యులు దాదాపు 200 మంది పాల్గొన్నారు.

మూడవ రోజుకు చేరిన గ్రామ పంచాయతీ సమ్మె

జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా శనివారం మూడవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ఓ.రఘు మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలన్నారు.ఈ సమ్మెకు మద్దతుగా కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, మున్సిపల్ మాజీ కమీషనర్ దేవుసింగ్, విజేందర్ రెడ్డి, బిఎస్‌పి జిల్లా ఇంచార్జి వి.రాజేందర్, జిల్లా అధ్యక్షులు శనిగరపు నరేష్ కుమార్, రాజశేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, గ్రామపంచాయతీ కార్మికులు, జితేందర్, జయాకర్, రజినీకర్, స్వరూప,సాంబయ్య,మాధవ స్వామి కె సురేందర్, అశోక్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల : గ్రామపంచాయతీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శనివారం నాటికి మూడో రోజు చేరుకుంది. శనివారం గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు రాపర్తి రాజు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘానికి సంఘీభావం తెలియజేస్తూ ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల చేపట్టిన సమ్మెను చిత్రవశం చేసేందుకు పుట్టలు పొందుతుందని గ్రామపంచాయతీ ఉద్యోగులు కనీస వేతనాలు అమలు చేయాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామపంచాయతీ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్లు బత్తిని వెంకన్న, బసవ రామచందర్, కొడకండ్ల గ్రామపంచాయతీ ఉద్యోగుల మండల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండలంలోని వివిధ గ్రామపంచాయతీలో పని చేస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బయ్యారం : గ్రామ పంచాయతీ సిబ్బంది ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని చేస్తున్న సమ్మెకు సేవాలాల్ సేన మహబూబాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రవి నాయక్ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు సంఘీభావం...

గ్రామ పంచాయితీ సిబ్బందికి వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పంచాయితీ సిబ్బంది రాష్ట్ర వ్యాప్త అఖిలపక్ష సమ్మెకి పిలుపునివ్వగా అట్టి సమ్మెకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య యాదవ్, టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం తెలిపారు.

గూడూరు : గ్రామపంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారి డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని గ్రామపంచాయతీ రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు బండ్ల అప్పిరెడ్డి అన్నారు. శనివారం గూడూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా శిబిరానికి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అప్పి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు రత్నం అశోక్, జిల్లా నాయకులు వీరన్న వెంకన్నలు గూడూరు మండలంలోని గ్రామపంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

మరిపెడ : తెలంగాణ గ్రామ పంచాయతీ సిబ్బంది, అండ్ కారోబార్ల, బిల్ కలెక్టర్ మల్టీపర్పస్ వర్కర్లు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మరిపెడ మండల గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్సర్ సిబ్బంది శనివారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణంలో నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ల, సిబ్బంది, అధ్యక్షులు యాకూబ్ పాషా, కార్యదర్శి అలవాల యాదగిరి ,మండల ఉపాధ్యక్షులు గుగులోతు నరేష్, కోశాధికారి గంగుల మహేష్, నాయకులు ఎ.వేణుగోపాల చారి, ఆర్.వెంకన్న, జి.నగేష్, ఎం.యాకయ్య, ఏ.నర్సయ్య వెంకన్న, నరేష్, యాకూబ్, మల్లయ్య వెంకటనారాయణ, తదితరులు ఉన్నారు.

వాజేడు : గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి)ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె 3వ రోజుకి చేరుకుంది. పంచాయతీ కార్మి కులకు కనీస వేతనం 26000 వేల రూపాయలు ఇవ్వాలని, గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి, ఫిఎఫ్, ఇఎస్ఐ, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌లతో సమ్మె కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షులు పూనెం ప్రసాద్, ఉపాధ్యక్షులు తొర్రెమ్ శ్రీనివాస్, సభ్యులు పీర్ల రామ చంద్ర మూర్తి, కంబాలపల్లి భాస్కర్‌రావు, బంధం సమ్మయ్య, గౌరారాపు సాంబశివరావు, అంకెనబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి: సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి

గోవిందరావుపేట: శనివారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది పంచాయతీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె మూడో రోజుకు చేరింది. సమ్మెకు సిపిఎం పార్టీ సంఘీభావం ప్రకటించి అనంతరం కార్మికులను ఉద్దేశించి వెంకటరెడ్డి మాట్లాడారు. వీరి ముఖ్యమైన 17 డిమాండ్లను వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సమస్యలు సాధించుకునేంతవరకు ఈ సమ్మెను కొనసాగించాలని ఎవరి బెదిరింపులకు, బుజ్జగింపులకు కార్మికులంతా తలోగ్గకుండా ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు గుండు రామస్వామి, పిట్టల అరుణ్, జీవన్, సంజీవ, కడారి నాగరాజు, గొంది రాజేష్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల నాయకులు దొంగరి ఉప్పలయ్య, తండా కుమార్, సూరారపు రాజు, సీతయ్య, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలి


సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్



నవతెలంగాణ-నరసింహుల పేట

నిత్యావసర ధరలు కూరగాయలు ధరలు, గ్యాస్ విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గునుగంటి మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూరగాయలు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ఏమి కొనాలన్నా వంద రూపాయల పైమాటేనని, ఏమి కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కేజీ టమోటాలు పచ్చిమిరపకాయలు కొనాలంటే నిరుపేదలు మధ్య తరగతి కుటుంబాల్లో కూరగాయలు కొనలేని స్థితిలో ప్రజలు వున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇవికాక ఇంకో పక్క గ్యాస్ విద్యుత్ చార్జీల ధరలు పెరిగాయన్నారు. ప్రభుత్వాలు నిత్యావసర ధరలు తగ్గించడంలో విఫలమయ్యారని, తక్షణమే నిత్యావసర ధరలు తగ్గించాలని సిపిఎం పార్టీ తరపునవారు డిమాండ్ చేశారు. అలాగే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టిన ఫలితం లేదన్నారు. రైతు ప్రభుత్వమంటూ చెప్పుకొచ్చిన కెసిఆర్ ప్రభుత్వం రైతులను ముంచిదన్నారు. తక్షణమే పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే వెలుగోడు పట్టణంలో కాల్వలు నదులను ఆక్రమిస్తున్న అధికారులు మెద్దునిద్ర వీడడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోమిరెడ్డి, నవీన్, బక్కయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.


40 వేల ఆర్థిక సహాయం అందించిన తోటి మిత్రులు



నవతెలంగాణ-ములుగు

మండలంలోని జాకారం గ్రామానికి చెందిన రుద్రబోయిన రఘుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా (1998 పదవ తరగతి బ్యాచ్, అబ్బాపూర్ జెడ్పిహెచ్ఎస్) చెందిన తోటి మిత్రులు 40 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయస్సులో మిత్రున్ని కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. అతనికి ఇద్దరు కూతుర్లు, భార్య ఉన్నారని, పెద్దగా ఎలాంటి ఆస్తి పాస్తులు లేకపోవడంతో ఆ కుటుంబానికి చేదోడు వాదోడుగా క్లాస్ మెట్స్ అందరూ కలిసి ఎవరికి వారు వారికి తోసినంత ఆర్థిక సహాయం అందించారు. రఘుపతి కుటుంబానికి అండదండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద శ్రీనివాస్, సామంతుల కోటి, పంచగిరి శ్రీనివాస్, కొంగరి మహేందర్,రాస రాజేందర్,యార కుమారస్వామి, భాస్కర్,రంజిత్‌లతో పాటు అబ్బాపూర్, జాకారం, వెంకటేశ్వర్లు మిత్రులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల దృష్ట్యా పలువురి అరెస్టు విడుదల



నవతెలంగాణ-గోవిందరావుపేట

శాంతిభద్రతల సమస్య దృష్ట్యా, మోడీ పర్యటన సందర్భంగా ఎలాంటి సంఘటన తలెత్తకుండా సిపిఐ ఎం, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్‌ల నుండి పలువురిని అదుపులోకి తీసుకొని విడుదల చేసినట్లు పసర ఎస్ఐ సిహెచ్ కరుణాకర్ రావు తెలిపారు. శనివారం పసర పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిహెచ్ కరుణాకర్ రావు కథనం ప్రకారం వరంగల్ మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ ప్రకటనలు చేస్తున్న క్రమంలో శాంతిభద్రతలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలో భాగంగా సిపిఎం పార్టీకి చెందిన తుమ్మల వెంకటరెడ్డి, గుండు రామస్వామి, గొంది రాజేష్, కడారి నాగరాజు, క్యాతం సూర్య నారాయణ, బచ్చు సంజీవ, ఎమ్మార్పీఎస్ ఇరుగుపైడి మడిపల్లి శ్యాంబాబు, పేరాల బలరాం, తోకల రాంబాబు, కాంగ్రెస్ కే.శ్రీనివాసరెడ్డి, పాలడుగు వెంకటకృష్ణ, రసపుత్ సీతారాం నాయక్, పన్నాల ఎల్లారెడ్డి, జంపాల ప్రభాకర్, దాసరి సుధాకర్, తేల్ల హరిప్రసాద్‌లను ఉదయం అదుపులోకి తీసుకొని సాయంత్రం విడుదల చేశారు.

బాధిత కుటుంబానికి రాష్ట్ర సంఘ నేతల పరామర్శ

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలకేంద్రానికి చెందిన ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్వపల్లి రమేష్ శర్మ తండ్రి గోపాల కృష్ణ శర్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలిసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిండిపోలు నాగ దక్షిణామూర్తి, ప్రధాన కార్యదర్శి అన్నావజ్జల ప్రసాద్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికీర్తి అమరేందర్ శర్మ తదితరులు శనివారం వారింటికి వెళ్లి రమేష్ శర్మ తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాదిత కుటుంబాన్ని ఓదార్చి రాష్ట్ర సంఘం అండగా ఉంటుందని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు




నవతెలంగాణ-కేసముద్రం రూరల్

శంకర్ నాయక్ పై చేస్తున్న అసత్య ఆరోపణ ఎండకట్టడానికి కేసముద్రం మండల పార్టీ కార్యాలయంలో ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి ,నజీర్ అహ్మద్‌లు ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి మహబుబబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై వస్తున్న మీడియా, మాధ్యమాలు అసత్య ఆరోపణలను అబండాలను ఖండిస్తూ, ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే శంకర్ నాయక్ విజయం ఖాయమని శంకర్ నాయక్ పై అసత్య ఆరోపణలు చేస్తూన్న విమర్శకుల గుండెల్లో నిద్రపోతామని అంతేకాకుండా మానుకోట గడ్డ శంకర్ నాయక్ అడ్డా అని అన్నారు. మానుకోట గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని కొంతమంది నాయకులు వెనుక ఉండి కార్యకర్తలు ముందు పెట్టి బిఆర్ఎస్‌లో చిచ్చు పెట్టిస్తున్నారని నియోజకవర్గాన్ని 365 రోజులు ప్రతి కార్యకర్త కుటుంబంలో వెన్నుదన్నుగా ఉండి ప్రజల సమస్యలను ఆదుకొని మానుకోట అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనుండి ఎవరు విమర్శలు చేసిన సహించేది లేదని మండల పార్టీ అధ్యక్షులుగా హెచ్చరించారు. మూడోసారి శంకరన్న విజయానికి ప్రతి కార్యకర్త అండదండగా ఉండి విజయం తధ్యం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణపారపు రమేష్, కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, ఆగే వెంకన్న, సట్ల వెంకన్న, లింగాల పిచ్చయ్య , నాగిరెడ్డి, రాహుల్,మంద సాయిబాబా, వెంకన్న, సామెల్, మహేందర్, కమటం శ్రీనివాస్, వీరు నాయక్, మండల ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాల ఎంపీటీసీలు మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశం ఏర్పాటు చేసి శంకర్ నాయక్ విజయానికి తోడ్పాటు అందిస్తామని ముక్తకంఠంతో చెప్పారు.

విభజన హామీలు అమలు చేయాలి

తుమ్మల వెంకటరెడ్డి, రైతు సంఘం ఉపాధ్యక్షులు



నవతెలంగాణ-గోవిందరావుపేట

విభజన హామీలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం మండలంలోని పసర గ్రామంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.సంజీవ ఆధ్వర్యంలో విభజన హామీలను అమలు చేయడంతో పాటు ఆవాస్ యోజన పథకం కింద అర్హులైన పేదలకు 10 లక్షల రూపాయలు ఇంటిన నిర్మాణం కోసం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 163 వ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి వెంకటరెడ్డి మాట్లాడారు. గడిచిన తొమ్మిది సంవత్సరాలుగా అనేకసార్లు తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన మోడీ విభజన హామీలను అమలు చేస్తానని చెప్పి ఇప్పటివరకు ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బడా పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ ఆదా నీ అంబానీలకు సబ్సిడీల పేర కోట్ల రూపాయలను ఉచితాలుగా ఇస్తూ రెక్కాడితే డొక్కాడని పేదలపై జీఎస్టీ ల పేరుతోటి గ్యాసు ఉప్పు పప్పు కనీస అవసరాలపై పెనుబారాలు మోపుతూ పేదల నడ్డి విరుస్తుందని పెద్దలకు దూసి పెట్టే పనిపై ఉన్న శ్రద్ధ పేదలపై లేదని వారు ఎద్దేవా చేశారు రెండు కోట్ల ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు ఇస్తానని నమ్మబలికి రెండోసారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నేటి వరకు ఒక హామీని కూడా నెరవేర్చకుండా ఈరోజు తెలంగాణ ప్రజల ముందుకు రావడానికి సిగ్గుండాలి అని వారు విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజలపై చిత్తశుద్ధితో వ్యవహరించి విభజన హామీలను అమలు చేయాలని దేశంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల అన్ని భర్తీ చేయాలని ఆవాస్ యోజన పథకం కింద అర్హులైన నిరుపేద కుటుంబాల అందరికీ ఇంటి నిర్మాణం కోసం పది లక్షల రూపాయలు ఇవ్వాలని వారు కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాలు చేస్తామని వారు ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం నాయకులు కడారి నాగరాజు, కేతం సూర్యనారాయణ, జిత్తబోయిన రమేష్, పల్లపు రాజు, సీతారామరాజు, బ్రహ్మచారి, ఉపేంద్ర చారి, మహిళా సంఘం నాయకులు మంచాల కవిత, కారం రజిత, కందుల రాజేశ్వరి, జిమ్మ జ్యోతి, డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు పిట్టల అరుణ్, సిరిపల్లె జీవన్, గణేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలను అడిగితే అక్రమ కేసులా?

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్



నవతెలంగాణ-ములుగు

రాహుల్ గాంధీ పై వచ్చిన అక్రమ తీర్పుపై నిరసన కార్యక్రమాలు చేపడతా రని ములుగు పోలీస్‌లు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తు అక్రమ అరెస్ట్ చేయడం సరైంది కాదనీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మోడీలంతా కేడిలే అన్నందుకు రాహుల్ గాంధీ పై సూరత్ జిల్లా కోర్టులో పరువునష్టం దావా కేసు వేస్తూ బీజేపీ ఎంపీ పిటిషన్ దాఖలు చేయగా అట్టి పిటిషన్ విషయంపై గుజరాత్ హైకోర్టుకి స్టే ఇవ్వాలని కోరగా, అక్కడ కూడా చుక్కెదురు అయిందని రెండేళ్ల జైలు శిక్షను విధిస్తూ జిల్లా కోర్టుకు మద్దతు ఇవ్వగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కావాలని కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ప్రధాని మోదీ తన స్నేహితులకు, ముఖ్యంగా గుజరాతీ కంపెనీలకు దేశ సంపదను దోచి పెడుతున్నారని అన్నందుకే ఇవ్వాళ పార్లమెంట్ బహిష్కరణ చేశారని అన్నారు. గుజరాత్ జిల్లా కోర్టు ఇచ్చిన అక్రమ తీర్పుపై న్యాయ పోరాటం చేయకుండా మమ్మల్ని పోలీసులు అడ్డగించడం అప్రజాస్వామికం అని, ప్రజాస్వామ్యంలో పోరాటం చేసే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అక్రమ అరెస్టులు మా పోరాటాన్ని ఆపలేవు అని అన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవి చందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్, ములుగు మండల అధ్యక్షులు ఎండి. చాంద్ పాషా, ములుగు పట్టణ అధ్యక్షులు చింతనిప్పుల బిక్షపతి, జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సహకార సంఘం నాయకులు, కార్యకర్తలు తదితర నాయకులు పాల్గొన్నారు.

గుడిసె వాసులపై గుండాల దాడి



నవతెలంగాణ-జనగామ

జనగామ జిల్లా లింగాల గణపురం మండలం నెల్లుట్ల గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 464, 465, 46 మొత్తం ఏడెకరాల 10 గుంటల భూమిలో ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు.ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10 గంటలకు నెల్లుట్ల గ్రామానికి చెందిన నల్ల లాజర్ 20 మంది గుండాలను తీసుకొని కత్తులు, గొడ్డళ్ళు, కర్రలు తీసుకొని వచ్చి మీరు ఇక్కడ ఎందుకు గుడిసె లేసినారు అని మహిళలను రాయడానికి బూతులు తిడుతూ మహిళలపై వృద్ధుల పై దాడి చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో భూమాఫియ గుండాలు రెచ్చిపోయి పేదలపై దాడులు చేస్తున్నారు. ఇలాంటి భూమాఫియా గుండాలను ప్రభుత్వం కంట్రోల్ చేయకపోతే మరో బీహార్ లాగ తెలంగాణ మారుతుందని రేప్ గుండాలకు అడ్డగా ఉంటుందని భూ పోరాట కమిటీ కార్యదర్శి అన్నారు. ఈ సందర్భంగా కమిటీ కార్యదర్శి తోటి దేవదానం మాట్లాడుతూ పేదలపై రాత్రిపూట వచ్చి మహిళలని కూడా చూడకుండా దుండగులు దాడి చేసిన లాజర్ మరియు వచ్చిన గుండాలపై చట్టపరమైన చర్యలు తీసుకొని పేదలకు రక్షణ కల్పించాలని పోలీసు యంత్రాంగాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గుడిసెలు వేసుకున్న పేద లందరూ పాల్గొన్నారు.

చెత్తను సేకరించిన ఉపసర్పంచ్

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని పోచన్నపేట గ్రామంలో ఉప సర్పంచ్ శనివారం గ్రామపంచాయతీ సంబంధించిన చెత్త ట్రాక్టర్తో గ్రామంలోని చెత్తను సేకరించి యార్డుకు తరలించాడు. పంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తున్నదన్న విషయం గ్రామ ప్రజలకు తెలిసిందే, చెత్త, చెదారం పేరుకు పోయాయని సమస్యను గ్రామ ఉప సర్పంచి శ్రీ జూల కిష్టయ్యకు గ్రామ యువకులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

పామ్ ఆయిల్ సాగుపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలం మంథోనిగూడెం గ్రామంలో ఆయిల్ ఫామ్ పంట గురించి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ , జిల్లా ఉద్యాన శాఖ అధికారిని లత మేడం, ఆయిల్ ఫెడ్ జిల్లా ఇంఛార్జి రామ కృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వం సబ్సిడీలో ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహిస్తుంది. పెద్ద రైతులు ఈ పంటను వేసుకొని అధిక లభాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.సత్యనారాయణ, ఏట వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, వితంతువులకు రగ్గుల పంపిణీ



నవతెలంగాణ-ధర్మసాగర్
మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి 73వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో వృద్ధులు, వితంతువులకు రగ్గులను బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కొట్టే ప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ పాల్గొని మాట్లాడుతూ కడియం శ్రీహరి మంచి నాయకుడుగా, ప్రజల శ్రేయస్సు కోరే ప్రియతమ నాయకుడుగా, అపర భగీరథుడిగా ప్రశంసించారు. నిరుపేదలైన వృద్ధులు, వితంతువులకు రగ్గులు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్డు అరుణ రవీందర్, నాయకులు బొడ్డు ప్రదీప్ కుమార్, బొడ్డు సురేష్, కొట్టే యాదగిరి, కొట్టే జలంధర్ గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్‌తో సంబరాలు



నవతెలంగాణ-కేయూ క్యాంపస్
కాకతీయ యూనివర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్ రావటం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ కేయూ మొదటిగేట్ వద్ద స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.రమేష్, రిజిస్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులు, బోధనతర సిబ్బంది అందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ కుమార్, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ మధుకర్, డాక్టర్ ఫణికాంత్ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ పోలీసుల అత్యుత్సాహం





నవతెలంగాణ-మట్టెవాడ
మోడీ పర్యటనలో మిల్స్ కాలనీ పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. ప్రతిపక్ష నాయకులను ప్రజాసంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు సీపీఎం రంగసాయిపేట ఏరియా కమిటీ సభ్యురాలు మాలోతు ప్రత్యూషను శనివారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 13 ఏళ్ల తన కూతురు 24 గంటల నొప్పితో ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసుకొని ఒంటరిగా ఉందని ప్రాధేయపడిన అవేమీ పట్టించుకోని పోలీసులు ఆమెను నిర్బంధించి పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లారు. రంగసాయిపేట ఏరియాకార్యదర్శి మాలోతు సాగర్ కడుపునొప్పితో ఆసుపత్రిలో గురువారం చేరగా శుక్రవారం రాత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. శనివారం ఉదయం ఆసుపత్రి నుండి ఇంటికి వెళ్లి టిఫిన్ తీసుకొస్తానన్న క్రమంలో ఇంటికి వెళ్ళగా పోలీసులు ఆమెను నిర్బంధించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. నిర్బంధంపై సోషల్ మీడియాలో వార్త వైరల్ కావడంతో ఆమెను పంపించిన పోలీసులు ఆమె భర్త మాలోతు సాగర్‌ని అరెస్టుచేసి పోలీస్ స్టేషన్కు తరలించి బైండోవర్ కేసునమోదుచేసి సొంతపూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా మాలోతుసాగర్ మాట్లాడుతూ మానవత్వంతో ఆలోచించాల్సిన పోలీసులు తన కూతురు ఆరోగ్య పరిస్థితి చెప్పినా అరెస్టు చేయడం ఏమిటన్నారు.

సోషల్ మీడియా, యూత్ కమిటీల నియామకం

నవతెలంగాణ-పర్వతగిరి
జిల్లా బిఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి ఆరూరి విశాల్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని అన్నారం షరీఫ్‌లో సోషల్ మీడియా,యూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రంగు కుమార్, పిఏసిఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, సర్పంచ్ మునుకుంట్ల యశోద, గ్రామ పార్టీ అధ్యక్షులు బూర యాకయ్య, సోషల్ మీడియా మండల కన్వీనర్ బొట్ల మధు, మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బూర శ్యామ్, మాసానివెంకట్, రాజశేఖర్, దబ్బెట నరేష్, నవీన్, యూత్ నాయకులు రాపోలు రాజేష్, సాయి, రాహుల్, సుధాకర్, శివ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-పర్వతగిరి
మండలంలోని కల్లెడ పరిధిలోని ముంజాలకుంటతండా గ్రామపంచాయతీలో చెక్రు తండాకు చెందిన బి.బుజ్జికి శనివారం రైతు బంధు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్ సీఎంఆర్ఎఫ్ నుండి మంజూరైన రూ.17 500ల చెక్కును ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాటోత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొండైలుపల్లిలో యువరైతు ఆత్మహత్య



నవతెలంగాణ-నల్లబెల్లి
మండలంలోని కొండైలుపల్లికి చెందిన యువ రైతు రాధారపు నవీన్ కుమార్(27) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. నవీన్‌కుమార్ మృతితో కొండైలుపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గత ఆరు నెలల నుండి అల్సర్‌తో బాధ పడుతుండగా రోజురోజుకు నొప్పితీవ్రత పెరగడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి పడిపోవడంతో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ నవీన్‌కుమార్ మృతిచెందినట్లు అతడి తండ్రి రాజయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై నగేష్ తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-వేలేరు
మండలంలోని పీచర గ్రామంలో ఆ గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ గుజ్జుల పూల దేవి మృతదేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేక రవీందర్, వైస్ ఎంపిపి అంగోతు సంపత్, కో-ఆప్షన్ ఎండి.జానీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మరిజే నర్సింగరావు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గండ్ర దంపతుల పర్యటన

నవతెలంగాణ-శాయంపేట
మండల పరిధిలోని గ్రామాలలో రూ. 20 కోట్ల 61 లక్షల 25 వేల నిధులతో చేపట్టనున్న అభివద్ధి కార్యక్రమాలను ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ జ్యోతి పాల్గొని ప్రారంభిస్తారని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి శనివారం తెలిపారు. జోగంపల్లి గ్రామ శివారులోని చలివాగు ప్రాజెక్టు సమగ్ర మరమ్మతు పనులకు 10 కోట్ల 21 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు భూమి పూజ, ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకు వర్షాకాల పంటలకు సాగునీటి విడుదల, కొప్పుల జోగంపల్లి గ్రామాల మధ్య 7 కోట్ల నిధులతో నిర్మించిన బ్రిడ్జి ప్రారంభం, కొప్పులలో సిడిఎఫ్ నిధులతో 14 లక్షల 85 వేల నిధులతో కుల సంఘాల కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన, 3 లక్షల సిడిఎఫ్ నిధులతో వెటర్నరీ సబ్ సెంటర్, కొప్పుల సూర్యనాయక్ తండ గ్రామాలకు రెండు కోట్ల 62 లక్షల నిధులతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, కొప్పుల గ్రామంలో 34 లక్షల 95 వేల నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవం, దళితులతో సహపంక్తి భోజనం ఉంటుందని తెలిపారు.

అనంతరం వసంతపూర్ గ్రామంలో 4 లక్షల 95 వేల సిడిఎఫ్ నిధులతో రైతులు పొలాలు వెళ్లేందుకు ఆయకట్టు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన, గట్లకనిపర్తి గ్రామాల్లో 20 లక్షల నిధులతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ధైర్యం ఉంటే ఎదురుగా నిలబడి గెలవాలి



నవతెలంగాణ-ధర్మసాగర్
అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్సీ కడియం శ్రీహరిపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారు ధైర్యం ఉంటే ఎదురుగా నిలబడి విజయం సాధించాలని ప్రజా ప్రతినిధులు మునిగాల యాకోబు, రాజారపు యాదగిరి, తోట నాగరాజు, ఎర్రబెల్లి వెంకట నరసమ్మ, కందుకూరి జయమ్మ జలంధర్, చాడ నరసింహారెడ్డి, అనురాధ రా గూర్, బొడ్డు ప్రదీప్ కుమార్, బొడ్డు అరుణ ఇమాన్‌లు సవాల్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్లో ప్రియతమా మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి 73వ జన్మదిన వేడుకల సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాటికాయల సర్పంచ్ పెసలు రమేష్, స్థానిక సర్పంచి ఎర్రబెల్లి శరత్ ఆధ్వర్యంలో ఆయన జన్మదిన వేడుకలను మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు,మాజీ ప్రజా ప్రతినిధులు, అభిమానులు పార్టీ కార్యకర్తలు అట్టహాసంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దమ్ముంటే కడియం శ్రీహరి ఎదురుగా పోటీలో నిలబడి గెలవాలని, కొందరు నాయకులు కల్లబొల్లి మాటలతో, లేనిపోని మాటలతో కడియం శ్రీహరి పైన చేస్తున్న అనుచిత వాక్యాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తగిన శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్ర మంలో మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య



నవతెలంగాణ-రాయపర్తి
గ్రామ పంచాయితీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె శనివారంనాటికి 3వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జీపీ సిబ్బందికి సంఘీభావం తెలిపిన వెంకటయ్య మాట్లాడుతూ జీపీ కార్మికులకు తాత్కాలికంగా రూ.19వేలు వేతనంగా చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, 2011 జనాభా ప్రాతి పదికన కార్మికులను నియమించాలని డిమాండ్ వ్యాఖ్యానించారు. జిపి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని లేనియెడల పెద్దఎత్తున ధర్నా రాస్తారోకోలు చేపడతామని తెలిపారు. ఈ సమ్మెలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లాఅధ్యక్షుడు గూడెల్లి ఉప్పలయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపేందర్, శ్రీను, మహాత్మ, రత్నాకర్, సంపత్, పద్మ, రాములు, ఎల్లయ్య, బాబు, రాజు, అఖిల్, దేవేందర్, మల్లయ్య, కొమురయ్య, అభిషేక్, రమ, బాలాజీ, మహేందర్, నరహరి, యాకయ్య, నర్సమ్మ, యాకంతం, మధు, కుమార్, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తా : ఎమ్మెల్యే నన్నపునేని



నవతెలంగాణ-వరంగల్
క్రిస్టియన్ల అభివద్ధికి పూర్తి సహకారం ఎప్పటికీ ఉంటదని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ అన్నారు.వరంగల్ తూర్పు నియోజకవ ర్గంలోని పాస్టర్లు అందరూ కలిసి వరంగల్ క్రిస్టియన్ సొసైటీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, ఎమ్మెల్సీ రాజేశ్వరరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా వరంగల్‌లోని అబ్బుస్ ఫంక్షన్ హాల్‌లో ఈ ప్రారంభోత్సవాన్ని ఏర్పాటు చేసి ఈ క్రిష్టియన్ సొసైటీ చైర్మన్‌గా సరిగోమ్ముల దీన్ దయాల్, అధ్యక్షులుగా అరుణ్ జేమ్స్,సెక్రటరీ సాల్మన్ రాజ్, వైస్ చైర్మన్ ఎమ్మెస్.రాజు, యూత్ అధ్యక్షులుగా వస్కుల వినయ్, ట్రెజరర్ గాబ్రియల్, అడ్వైజర్ సాంసన్, వైస్ ప్రెసిడెంట్ కొమ్ము రాజు,ఈసీ మెంబర్ సింగారం సురేష్,పాస్టర్ శామ్యూల్, మన్నా చర్చ్ పాస్టర్ ఎలిషా ఎర్నెస్ట్, పాస్టర్ ఎర్ర రవి పాల్, పాస్టర్ బాబ్జి, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ నిరుపేదలైన పాస్టర్లకు ప్రభుత్వ పథకాలు గృహాలక్ష్మి, దళితబంధు, డబల్ బెడ్‌రూమ్‌లో ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ఐక్యంగా ఉండి మీ చర్చిలు అభివృద్ధి చేసుకోవాలని, అందరూ ఐక్యంగా ఉంటే మీకే ఎక్కువ మేలు జరుగుతాయని అన్నారు.

ఓట్లకోసం కాదు ఐక్యంగా మీరు ఉంటే యేసయ్య నమ్మిన భక్త జనులకు కూడా సహాయసహకారాలు అందుతాయని, గొప్పగా అభివృద్ధి చేసే అవకాశం మాకు ఉంటుందని, ఏ అవసరం ఉన్న కమిటీ ద్వారా నన్ను కలవాలని రెండు మూడు విడతల్లో అవసరాలను తీర్చే పూర్తిచేసే బాధ్యత తనదని అన్నారు. సమాధుల తోట, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కషి చేస్తా అని అన్నారు. అతి త్వరలో మీకు మాటఇచ్చిన పనులన్నీ మొదలు పెడతా అని అన్నారు.రోడ్డు డ్రైనేజీ, ఎలక్ట్రికల్ అన్నిఏర్పాటు చేసి సమాధుల తోట ఇచ్చే జిమ్మేదారి తీసుకుంటున్ననని తెలిపారు.తూర్పులో 13వేల కుటుంబాలకు దళితబంధు ఇచ్చే జిమ్మేదారి కేసీఆర్ ది,స్థానిక ఎమ్మెల్యేగా నాదని అన్నారు.కాశిబుగ్గలో బీజేపీ వాళ్ళు పాస్టర్లపై దాడి చేస్తే దగ్గర ఉండి వారిని కాపాడానని అన్నారు.క్రిస్టియన్ సొసైటీ సభ్యులు ఐక్యతతో పని చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నని అన్నారు. పాస్టర్ల రూపంలో వివిధ పార్టీలల్లో ఉన్న వాళ్లు వస్తున్నారు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వస్కుల బాబు,జన్ను అనిల్,మాజీ కార్పొరేటర్ బిక్షపతి, బోడ డిన్న, నియోజకవర్గ పాస్టర్లు, క్రైస్తవ కుటుంబాలు, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ శైలితో రైతుల ఇబ్బందులు



నవతెలంగాణ-ఖానాపురం
ప్రభుత్వం రైతులకు అండగా ఉండి వినూత్న పద్ధతిలో వ్యవసాయంలో ఆయిల్ ఫామ్‌సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఆశయాన్ని రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ యాజమాన్యం వ్యవహార శైలి తూట్లు పొడుస్తుంది. వివరాల్లోకి వెళితే ఆయిల్‌ఫాం సాగుపై రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం వరంగల్ జిల్లాకు చెందిన రామ్‌చరణ్‌ఆయిల్‌ఫామ్ ఇండస్ట్రీస్ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుని మొక్కలు సరఫరా చేస్తూ రైతులకు సహాయ సహకారాలు అందించాలని సూచించింది. మండలంలోని కొందరు రైతులు తమకున్న వ్యవసాయ భూమిలో ఆయిల్ ఫామ్ మొక్కలను సాగు చేశారు. నిబంధనల ప్రకారం ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కొన్ని మొక్కలు చనిపోగా వాటి స్థానంలో నూతన మొక్కలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇండస్ట్రీస్ యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించి రైతులకు ఎటువంటి సహకారం అందించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు మొక్కలను విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలు రైతులు ఆరోపిస్తున్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కను అందించడానికి అధిక ధరలు చెల్లించాలంటూ ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఎకరాకు చనిపోయిన మొక్కలస్థానంలో నూతన మొక్కలు కొనుగోలు చేయడానికి రూ.20లు ధర ఉంటుందని ప్రారంభంలో తెలిపారు. కానీ ప్రస్తుతం ఒక్క మొక్కకు రూ.193 లు చెల్లించాలని చెబుతూ అందించాల్సిన మొక్కలు అందించకుండా కాలయాపన చేస్తున్నారని రైతుల గోడు వెళ్లబుచ్చుకున్నారు. రైతులు వ్యవసాయ భూమిలో మొక్కలు నాటి పదినెలలు గడుస్తున్నా కానీ నూతన మొక్కలు ఇంతవరకు అందించలేదని వాపోయారు. మొక్కలకు అవసరమైన క్రిమిసంహారక మందులు అందించకుండా ఇతర ఫర్టిలైజర్ వాళ్ళతో కుమ్మక్కై అనవసర మందులు రైతుల కంటగడుతూ మోసం చేస్తున్నారని వాపోయారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రాంచరణ్ ఆయిల్‌ఫామ్ ఇండస్ట్రీకి తగు సూచనలు చేస్తూ రైతులకు అండగా నిలవాలని మండల ఆయిల్‌ఫామ్ రైతులు కోరుతున్నారు.

నాణ్యతకు నమ్మకమైన మలబార్ గోల్డ్ : చీఫ్‌విప్ దాస్యం

హనుమకొండలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం పున:ప్రారంభం





నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా
హనంకొండ నగర ప్రజలకు నాణ్యమైన ధరలు వివిధ డిజైన్లతో రూపొందించబడిన బంగారు, డైమండ్ ఆభరణాల మలబార్ షోరూంను నక్కలగుట్ట మెయిన్ రోడ్‌లో శనివారం ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు, నగరం మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ 11 దేశాలలో 320 పైగా షోరూమ్‌లతో గ్లోబల్ జువెలరీ రిటైలర్‌గా మలబార్ గోల్డ్అండ్ డైమండ్స్ కేరళ రాష్ట్రంలో కాలికాట్ పట్టణంలో 1993లో స్థా పించబడి అత్యంతనాణ్యతతో రూపొందించబడి న బంగారు ఆభరణాల సేకరణను అంతర్జాతీయ స్థాయిలో ప్రజల మొన్ననను పొందిందని ఆమె తెలిపారు. దీనిలో భాగంగానే వరంగల్ నగరంలో ఈ షోరూం పునప్రారంభించడం శుభసూచికమని తెలిపారు.నాణ్యమైన ధరలో ప్రజలకు ఆకర్షణీయమైన డిజైన్లతో ఆకట్టుకునేలా రూపొందించబడి ఉన్నాయన్నారు. అన్ని శుభకార్యాలకు వివిధ ఆకృతులతో అలం కరణ రూపంగా నగరప్రజలకు అందుబాటులోకి మలబార్ గోల్డ్అండ్ డైమండ్స్ షోరూమ్‌లో లభించడం సంతోషకరమని ఆమె తెలిపారు. మలబార్ సంస్థల అధినేత సిరాజ్ మాట్లాడుతూ 4.9శాతం నుండి ప్రారంభమయ్యే అత్యల్పతరుగు చార్జితో మలబార్ ఫెయిర్ ప్రెస్ నమ్మకమైన పారదర్శకత ధరతోఆభరణాలను అందిస్తుందని మలబార్ గోల్డ్అండ్డైమండ్స్ జీరో శాతం డిడక్షన్ గోల్డ్ఎక్స్ఛేంజ్ నమ్మకమైన హాల్ మార్ట్ లేకున్నా ఏ ఇతర షోరూమ్‌లో కొనుగోలుచేసిన 22 క్యారెట్ల బంగారు ఆభరణాలను మలబార్ హెచ్‌యుఐడి హాల్‌మార్క్ చేసిన ఆభరణాలతో మార్చుకోవచ్చని 100 శాతం మార్పిడి విలువను పొందవచ్చని తెలిపారు. కస్టమర్లు తమ ఆభరణాలను సులభంగా అప్గ్రేడ్ చేసుకోవచ్చు అని ఈ సందర్భంగా ఆయన సూచించారు. మలబార్ గ్రూప్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం ఆర్జించిన లాభాల్లో 5 శాతం మొత్తాన్ని ఇదే ప్రాంతంలో వివిధ ధార్మికదాతృత్వ కార్యకలాపాల కోసం కేటాయిస్తుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ షోరూం నిర్వహణ అధికారి అజీజ్ అహ్మద్, సోమాజిగూడ షోరూమ్ ఇంచార్జ్ షరీజ్, రాకేష్,,వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అప్పుడు అలా.... ఇప్పుడు ఇలా





నవతెలంగాణ-శాయంపేట
మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన గేటు రోడ్డు విస్తరణ పనులలో తొలగించారు. రోడ్డు పనులు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు గేటు నిర్మాణం చేపట్టలేదు. విద్యార్థులు పాఠశాల ప్రాంగణం నుండి ఒక్కసారిగా ఉరుకుల పరుగులతో రోడ్ ఎక్కినట్లయితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా ఉపాధ్యాయులే పాఠశాల ముగింపు సమయంలో గేటు వద్ద ఉండి పిల్లలు రోడ్డు క్రాస్ చేసే వరకు భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాల గేటు ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు స్థానిక సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ దష్టికి తీసుకెళ్లిన ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి విద్యార్థులకు రక్షణ కల్పించడానికి గేటు ఏర్పాటు చేయాలని, పాఠశాల ముందు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రామంలోని దాతలు విద్యార్థుల ప్రాణ రక్షణ కోసం ముందుకు వచ్చి గేటు ఏర్పాటుకు పిల్లర్ల నిర్మాణం చేపట్టాలని ఉపాధ్యాయ బృందం కోరారు.

భద్రకాళిని సందర్శించిన చీఫ్ సెక్రటరీ



నవతెలంగాణ-మట్టెవాడ
ఓరుగల్లు భద్రకాళి అమ్మవారిని తెలంగాణ చీఫ్‌సెక్రటరీ శాంతకుమారి శనివారం దర్శించుకున్నారు ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు ఆలయ ప్రధాన పూజారి భద్రకాళి శేషుఆధ్వర్యంలో పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా వల్లభగణపతిని దర్శించుకున్న ఆమె ఆలయంలో భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజలు ముగించుకున్న అనంతరం ఆలయ మండపంలో ఆమెకు వేదపండితులు మంత్రోచ్చారణలతో మహాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదం బహుకరించారు. తెలంగాణ దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి శేషుభారతిలు భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని ఆమెకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పూజారులు పాల్గొన్నారు.

48 గంటలు పోలీస్ స్టేషన్లలో సీపీఎం నాయకులు

మోడీ పర్యటన సందర్భంగా అక్రమ నిర్బంధం



నవతెలంగాణ-మట్టెవాడ
భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ శనివారం వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా సీపీఎం పార్టీ వరంగల్ హనుమకొండ జిల్లాల వివిధశాఖల నాయ కులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల, హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు బొట్ల చక్రపాణి, మంద సంపత్, భానునాయక్‌లను శుక్రవారం వారి వారి ఇళ్లలోకి వెళ్లి అక్రమంగా నిర్బంధించి అరెస్టు చేసిన పోలీసులు మడికొండలోని పోలీస్ ట్రైనింగ్ క్యాంపుకు తరలించారు. పోలీసుల నీడలో ఉన్న ప్రజా సంఘాల నాయకులు పార్టీ నాయకులు 48 గంటలుగా సరైన నిద్ర, హారాలు లేక సత మతమవుతున్నారు. ఈ సందర్భంగా సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ సిపిఎం పార్టీ నాయకులు అంటే ప్రధాన మోడీకి ఎంత భయం ఎందుకని తమ పార్టీ నాయకులను ప్రజాసంఘాల నాయకులను రెండు రోజులుగా నిర్బంధించి ఇబ్బందులు పెడుతున్నారని సరైనతిండి లేక కటిక నేలపై పడుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజల కోసం పోరాడుతున్న తమకు ఈ బాధలు లెక్కకాదన్నారు. అక్రమ అరెస్టులను ప్రజలు గమనిస్తున్నారని బిజెపికి త్వరలో బుద్ధి చెప్తారని తమను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేఎంసీకి పార్థీవ దేహం అప్పగింత



నవతెలంగాణ-మట్టెవాడ
వరంగల్ మట్టెవాడకు చెందిన భూపతి అన్నపూర్ణమ్మ (80) మరణించగా కుటుంబ సభ్యులు, వారి కుమార్తె భాగ్య లక్ష్మి, అల్లుడు యోగేంద్రనాథ్ భావివైద్యుల ప్రయోజనార్థం పార్థివదేహ దానంనకు ముందుకు రాగా తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో పార్థివ దేహాన్ని ప్రతిమ మెడికల్ కాలేజ్ వరంగల్ అనాటమీ విభాగపతి డాక్టర్ భాను, ఏవో మాధవి, ఎంబాలింగ్ ఇంచార్జీ ప్రభాకర్‌లకు వైద్య విద్య నిమిత్తం పార్థీవదేహంను శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ పార్థివదేహం ఎంబీబీఎస్ విద్యార్థులు ప్రత్యక్షంగా వైద్య విద్యను అభ్యసనాతో శాస్త్ర పరిశోధనకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాత్, అసోసియేష సలహాదారు డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విభజన హామీలు విస్మరించిన మోదీ : సీపీఎం



నవతెలంగాణ-మట్టెవాడ
పార్లమెంటు సాక్షిగా రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపై నిలదీస్తే కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయడాన్నీ నిరసిస్తూ ఖిలా వరంగల్ ఏరియా కమిటీ నాయకులు దుర్గయ్య ఆధ్వర్యంలో నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీల అమలు గురించి అడుగితే అరెస్టులు చేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ బయ్యారంకు ఉక్కు పరిశ్రమ, ఏర్పాటు చేస్తామని హామీని ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీ అమలు కోసం ప్రశ్నిస్తున్న సిపిఎం పార్టీ నాయకులను 48 గంటల ముందు నిర్బంధించిన పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య దేశంలో పాశవిక పాలనకు సాంకేతమని అన్నారు. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే స్థానిక యువతకు వేళల్లో ఉద్యోగాలు లభించేవని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీని గుజరాత్ కు తరలించిన ప్రధాని నరేంద్ర మోడీ, వ్యాగన్ రిపేర్ పిఓహెచ్ శంకుస్థాపన కోసం వరంగల్లో పర్యటించడం దేనికోసం అని దీనివల్ల నిరుద్యోగులకు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. నిత్యం పేదల పక్షాన పోరాడుతున్న సిపిఎం పార్టీ హామీల అమలుపై నిలదీస్తే పోలీసులు నిర్బంధించడానికి ప్రజలు చూస్తున్నారని తగిన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టులు చేసిన సిపిఎం ఇతర ప్రజా సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఆయనతో పాటు సుతారి సారంగపాణి, ఏరియా నాయకులు పసునూటి వేణు, భవాని, సదానందం, ఎల్లయ్య, ఆశమ్మ, సాంబలక్ష్మి, కవితలు పాల్గొన్నారు.

అరెస్టులతో ప్రజా పోరాటాలను ఆపలేరు

ఐనవోలు : రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాను అభివృద్ధి చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సరికాదని సీపీఎం హన్మకొండ జిల్లా కమిటీ సభ్యులు, ఐనవోలు మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. ప్రధాని మోడీ హన్మకొండకు రావడాన్ని వ్యతిరేకిస్తూ, విభజన సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం అభివద్ధి చేయలేదని ప్రశ్నిస్తారనే భయంతోనే ముందస్తు అరెస్టులు చేశారని అన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రాంతానికి చెందిన కాజీపేట రైల్వే స్టేషన్ లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, మెడికల్ కాలేజీలు, ఐఐటీలు, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు తదితర వాగ్దానాలు ఇచ్చిన మోడీ వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందాడని అన్నారు. వాస్తవానికి పివోహెచ్ మంజూరు 2017 లోనే అయ్యిందని నిధుల కేటాయింపు విషయంలో జరిగిన ఆలస్యం తప్ప బిజెపి ప్రభుత్వం కాజీపేటకు ఇస్తుంది ఏమి కాదని ఆయన తెలిపారు.

బిజెపి కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకుండా కాజీపేట ప్రాంతానికి తీవ్రమైన అన్యాయం చేస్తుందని ఆయన మండిపడ్డారు. వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసిన 900 మందికి మాత్రమే ఉపాధి దొరుకుతుందన్నారు.

నాగసముద్రం తూము షట్టర్ మరమ్మత్తు



నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని నాగసముద్రం చెరువు తూము షట్టర్ భాగంలో శనివారం చేపల చెరువు కాంట్రాక్టర్ కూరాకుల శ్రీధర్ కూలీలతో మరమ్మతు పనులను చేయించారు. చెరువులోని చేపలు పట్టడానికి గతంలో నాగసముద్రం చెరువు తూము కింది భాగంలో ధ్వంసం చేయగా నీరు వధాగా పోయింది. సంబంధిత రైతుల ఫిర్యాదు మేరకు నీటిపారుదల శాఖ ఏ ఈ ఆదేశాల మేరకు శనివారం శ్రీధర్ కూలీలతో తన స్వంత ఖర్చులతో కూలీలతో తూము మరమ్మతు పనులను చేయించారు. చెరువులో నుండి నీరు వదాగ వెళ్లకుండ నివారించారు. రాబోయో రోజులలోకూడ మత్స్యకారులు చేపలు పట్టడానికి వలలువేసి పట్టుకోవాలని, నీటిని వదాగ తూములద్వారా బయటికి వెళ్లగొట్టకూడదని,చేపలు పట్టుకోవడం అయిపోయాక తూముల షటర్ లను సరిచేసి, నీటిని కాపాడాలని శ్రీదర్ తెలిపారు.

ఊరురా పండుగలా కడియం జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-వేలేరు

మాజీ ఉప ముఖ్యమంత్రి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి జన్మదినం సందర్భంగా అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఊరూరా కేక్‌లు కట్‌చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అభిమానులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. అంబేద్కర్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం శాసనమండలి సభ్యుడిగా కొనసాగుతూ కూడా ఘనపూర్ అభివృద్ధికి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి కూడా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని కడియం అభిమానులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ గుజ్జుల రాంగోపాల్ రెడ్డి, సర్పంచులు గోదల రాజిరెడ్డి, జోడు ముంతల రమేష్, మాలోతు సంపత్, రామ్ చందర్, మాజీ ఎంపీపీ బొజ్జ రవీంద ర్‌యాదవ్, కడియం యువసేన వేలేరు మండల అధ్యక్షుడు పిండి అనుదీప్, సూత్రపు సంపత్, బొజ్జ రాజు, మారబోయిన రాజు, సందెల మొగిలి, గంజి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో ఘనంగా అలమ్మై మీట్ రీయూనియన్ సంబురాలు



నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం అలమ్మై మీట్ అండ్ సిల్వర్ జూబ్లీ బ్యాచ్-1997 రీయూనియన్ సంబురాలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగాప్రారంభోత్సవ వేడుకలో కిట్స్ వరంగల్ పూర్వ విద్యార్థులు, కిట్స్ వరంగల్ సీనియర్ గర్వించదగిన పూర్వ విద్యార్థి, కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డిని సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఫార్మర్ రాజ్యసభ సభ్యుడు, కళాశాలచైర్మన్, కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే, కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రటరీ, వి.సతీష్‌కుమార్, కిట్స్ వరంగల్ యాజమాన్య సభ్యులు ఇ.వెంకట్రామ్‌రెడ్డిలు పూర్వ విద్యార్థులు కిట్స్ జెండాను ప్రపంచ వ్యాప్తంగా ఎగురవేసినందుకు వారిని అభినందించారు. అనంతరం ముఖ్య అతిథి హైదరాబాద్‌కి చెందిన కిట్స్‌వా-హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు సి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ల కోసం సెమినార్లు, వర్క్‌షాప్‌లు, పారిశ్రామిక సందర్శనలు, లేబొరేటరీలలో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయడం, ముఖ్యంగా యూజీ, పీజీ విద్యార్థుల ప్రయోజనం కోసం క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లను నిర్వహించడం ద్వారా తమ మద్దతును అందజేస్తామన్నారు. విద్యార్థులు కోర్, లేటెస్ట్ టెక్నాలజికల్ సిస్టమ్స్‌లో శిక్షణ పొందినట్లయితే, వారు వారి కెరీర్‌లో విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్‌డబ్ల్యు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎం.కోమల్ రెడ్డి, కిట్స్‌డబ్ల్యు అలమ్మై అఫైర్స్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జ్ హెడ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం, డా.యం.శ్రీకాంత్, కిట్స్‌డబ్ల్యు అలమ్మై అఫైర్స్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జ్, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ ఆంజనేయులు, పిఆర్ఓ డాక్టర్ డి.ప్రభాకరాచారి, ప్రపంచవ్యాప్తంగా గొప్ప పారిశ్రామిక వేత్తలు, నిష్ణాతులైన ఇంజనీర్‌లు, కిట్స్‌డబ్ల్యు పూర్వ విద్యార్థులు, కిట్స్‌వా-నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్, వివిధ విభాగాల డీన్లు, వివిధ విభాగాల హెడ్స్, హెడ్, పిఎస్‌డి, అధ్యాపకులు, సిబ్బంది హాజరయ్యారు.

ప్రకృతి వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం

హనుమకొండ జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్



నవతెలంగాణ-హసన్‌పర్తి

ప్రకృతి వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యమని జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. మండలంలోని చింతగట్టు క్యాంపు మహర్షి గోశాల చారిటబుల్ ట్రస్ట్‌లో ఎస్ఆర్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య విధానంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. మన పూర్వీకులు ప్రకృతిలో దొరికే మూలికలతోనే మానవ రోగాలను అరికట్టేవారని తెలిపారు. మన శరీరంలో వచ్చే మార్పులకు అనుగుణంగా ప్రకృతిలో అన్ని రకాల మొక్కలు ఉపయోగపడతాయన్నారు. ప్రతి రోగానికి ప్రకృతిలోని మొక్కలే రోగ నివారణ ఔషధాలుగా పనిచేసేవని తెలిపారు. ప్రస్తుతం మన వారసత్వ ప్రకృతి వైద్యాన్ని విస్మరించడం వల్ల మానవుడు అనేక రోగాల బారిన పడి తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని తెలిపారు. మన పూర్వీకులు మనకు వారసత్వ సంపదగా ఆయుర్వేద వైద్యాన్ని భవిష్యత్తు తరాలకు అందేవిధంగా విద్యను బోధించేవారని ప్రస్తుతం వైద్యం మెడికల్ మాఫియా చేతిలో ఓ కీలుబొమ్మగా మారిపోయిందన్నారు. యువత ఇటువంటి శిక్షణ తరగతుల ద్వారా ప్రకృతి వైద్యాన్ని నేర్చుకొని భవిష్యత్తు తరాలకు అందించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహర్షి గోశాల నిర్వాహకులు సర్దన రమేష్, జీవ వైవిధ్య జిల్లా సమన్వయకర్త ఎ.లక్ష్మీ, కమిటీ సభ్యులు ఏరుకొండ సాగర్, ట్రస్టీలు రవీందర్, కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

చలివాగు బ్రిడ్జి ప్రారంభం సవ్యంగా సాగేనా...!

సోషల్ మీడియా వేదికగా రెండు వర్గాల ప్రచారాలు

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని జోగంపల్లి కొప్పుల గ్రామాల మధ్య నిర్మించిన చలివాగు బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. ఈ బ్రిడ్జిని ఆదివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి ప్రారంభించనున్నారు. ఇటీవల కాలంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సోషల్ మీడియా ఇన్చార్జీలు చలివాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో తొమ్మిది గ్రామాల ప్రజల నెరవేరుతున్న దశాబ్దాల కల అంటూ సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం నిర్వహించారు. దీంతో సిరికొండ వర్గీయులు చలివాగు బ్రిడ్జి నిర్మాణానికి ఏడుకోట్లు కేటాయించిన ఘనత మాజీ స్పీకర్ సిరికొండ కే దక్కిందని, బ్రిడ్జి నిర్మాణంతో ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని, రావాలి మదన్న అంటూ సోషల్ మీడియాలో వీడియోల ద్వారా పోటాపోటీ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

నిధులు మంజూరు చేసిన సిరికొండ ....

వర్షాకాలంలో ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలతో వరద నీరు భారీగా చలివాగు ప్రాజెక్టులోకి చేరి అలుగు పడినప్పుడల్లా కొప్పుల జోగంపల్లి గ్రామాల మధ్య లో లెవెల్ వంతెన పై నుండి నీరు ఉదతంగా ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. వర్షాకాలంలో వరద ఉధతిలో ఇద్దరు గల్లంతు అయ్యారు. సమస్యను పరిష్కరించడానికి అప్పటి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి 2018లో సీఎం కేసీఆర్ తో మాట్లాడి స్పెషల్ ఫండ్ కింద రూ.7కోట్లు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించారు. స్పీకర్ హయాంలోనే కొప్పుల గ్రామంలో పల్లె నిద్ర చేసిన క్రమంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 15 లక్షల నిధులు కేటాయించారు. కమ్యూనిటీ భవనం అసంపూర్తిగా ఉండడంతో 2018లో మరో 15 లక్షల నిధులు కేటాయించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలలో సిరికొండ ఓటమి పాలయ్యారు.

గండ్ర హాయంలో పనులు పూర్తి

2018లో జరిగిన ఎన్నికలలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపొందడంతో నిధులు కేటాయించిన పనులన్నీ పూర్తి చేయించారు. చలివాగు బ్రిడ్జి నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి కావడంతో ఈ నెల 9న ప్రారంభానికి సన్నద్ధమయ్యారు.

ప్రశాంత వాతావరణంలో ప్రారంభం జరిగేనా ?

ప్రస్తుతం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ప్రధాన అనుచరుడిగా కొనసాగుతున్న మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ బగ్గిరమేష్ కొప్పుల గ్రామం కావడంతో బ్రిడ్జి ప్రారంభోత్సవం ప్రశాంత వాతావరణంలో జరిగేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ స్పీకర్ హయాంలో విడుదల చేసిన నిధులతో పనులు చేపట్టారని, ప్రస్తుతం మాత్రం ఎమ్మెల్యే వెంకట్ రమణారెడ్డి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించినట్లు గొప్పలుగా సోషల్ మీడియా ఇన్చార్జీలు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సమంజసంమైందనికాదని వారు విమర్శిస్తున్నారు. ప్రారంభోత్సవ శిలాఫలకాలలో కూడా మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనచారి పేరు ఉండాలని వారు తెలుపుతున్నారు. ప్రజలందరికీ ఉపయోగపడే చలివాగు బ్రిడ్జి, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తి చేసినందుకు ఎమ్మెల్సీ సిరికొండ మసూదనాచారికి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ప్రజలందరూ కతజ్ఞతలు తెలియజేస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీలో వర్గ విభేదాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రారంభోత్సవాలు జరగడానికి ఇరు వర్గాల కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల గుండెచప్పుడు తెలిసిన నేత వైఎస్ఆర్



నవతెలంగాణ-భూపాలపల్లి

పేదవాడి గుండె చప్పుడు బాగా తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ గండ్ర సత్యనారాయణ రావు కొనియాడారు. శనివారం వైఎస్సార్ 74వ జయ ంతిని పురస్కరించుకొని భూపాలపల్లి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జయంతివేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని కి గండ్ర సత్యనారాయణరావు హాజరై వైఎస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఉన్నంతకాలం చరిత్రలో వైఎస్. రాజశేఖర్‌రెడ్డి నిలిచిపోతారన్నారు. దేశంలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చిన వ్యక్తి వైఎస్ఆర్ అని అన్నారు. ఈ వేడుకల్లో టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ఎన్ఎస్‌యూ ఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, ముఖ్యనాయకులు అంబాల శ్రీనివాస్, మందల రాజిరెడ్డి, ఉడుత మహేందర్, తోట రంజిత్, నగునూరి రజినీకాంత్, పానుగంటి శ్రీనివాస్, వెంకీయాదవ్, కిషోర్ రెడ్డి, బేంబడి సురేష్, చుంచుల మహేష్, నరేష్, చారి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



భూపాలపల్లిటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పాలన ఆయన తనయ వైయస్ షర్మిల తోనే సాధ్యమని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ అన్నారు. వైయస్సార్ 74వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా ఇడుపులపాయలోని వైయస్సార్ ఘాట్ లో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల అధ్యక్షతన ఇడుపులపాయలో ఏర్పాటు చేసిన జిల్లా అధ్యక్షుల సమావేశంలో భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కిషన్ పాల్గొని పార్టీ పరిస్థితులపై షర్మిలతో చర్చించడం జరిగిందన్నారు.

రాబోయే ఎన్నికలకు సమాయత్వం కావాలని భూపా లపల్లి జిల్లాలోని సమస్యలపై కేసీఆర్ ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా షర్మిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కిషన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం షర్మిల తోటి సాధ్యమవుతుందని, రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం







నవతెలంగాణ-చెన్నారావుపేట

అక్రమ అరెస్టులు ఆ ప్రజాస్వామికమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మోడీ పర్యటన నేపథ్యంలో చెన్నారావుపేట మండల నాయకులైన నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్ల పెళ్లి నరసయ్యగౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి హరీష్, కేతిడి జయపాల్‌రెడ్డి, చెవ్వ వెంకటేశ్వర్లు, గంగిడి మౌనిక రెడ్డిలను ముందస్తు అరెస్టు చేయడం ఆ ప్రజాస్వామికమని అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. పూర్తిగా మోడీ, కేడిలు ఇద్దరు కుమ్మక్కై రూపాయి కారి ఒప్పందంలో భాగంగా కాంగ్రెస్ పార్టీని అనగదొక్కే విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయడానికి పూనుకున్నారని మండిపడ్డారు. అరెస్టు అయిన వారిలో మండల సీనియర్ నాయకులు జోరు వీరయ్య, కూస సుదర్శన్ పటేల్, చిట్టి లింగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : వరంగల్‌లో శనివారం బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధాని విజయ సంకల్ప సభ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దే వేందర్‌రావును పోలీసులు హౌస్‌అరెస్ట్ చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను సభలు, సమావేశాల పేరిటఅరెస్ట్ చేసినంత మాత్రాన ప్రభుత్వాల పై ఆందోళనలు ఆపలేరని,రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాం గ్రెస్ కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

శాయంపేట : భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనను పురస్కరించుకొని పోలీసులు ముందస్తుగా శనివారం మండల కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మారపల్లి కటయ్య విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అగ్ర నాయకులకు దమ్ముంటే ముందస్తు అరెస్టులు చేయకుండా పర్యటనలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీని బలహీనపరచాలని కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. అధికార పార్టీ నేతలు ఎన్ని కుట్రలుపన్నిన కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బగ్గి రవి, సిపిఐ నాయకులు అనుకారి అశోక్, వంగరి సాంబయ్య, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అక్రమ అరెస్టులతో కేంద్ర రాష్ట్రాల్లో రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆపలేరని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు కమలాపురం రమేష్ అన్నారు. శనివారం వరంగల్ కు ప్రధాని మోడీ వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తొ పాటు,ప్రజా ప్రజాసంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం కమలాపురం రమేష్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులు చేయకుండా బిఆర్ఎస్,బిజెపి పార్టీలకు చెందిన మంత్రులు జిల్లాలో తిరిగే దమ్ముందా అని ప్రశ్నించారు.సర్పంచుల ఫోరం రాష్ట్ర నాయకులు పర్వతగిరి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దోపిడి,స్కాముల్లతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు.

పోలీసులు అరెస్టు చేసిన వారిలో పాక్స్ చైర్మన్ ఏరుకొండ రవీందర్,మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు,గ్రామ పార్టీ అధ్యక్షుడు భయ్యా కుమారస్వామి, పెద్దాపూర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ముసుకు మనోవర్ధన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జయపాల్ రెడ్డి, ఓబీసెల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ బయ్య తిరుపతి ,జిల్లా కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు,గ్రామ ప్రధాన కార్యదర్శి అలువాల రవి, మండల ప్రధాన కార్యదర్శి గుండెబోయిన శ్యామ్, మండల ప్రచార కార్యదర్శి కాడబోయిన రమేష్ యాదవ్, మండల అధికార ప్రతినిధి గఫూర్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తనుగుల సందీప్, మండల్ ప్రధాన కార్యదర్శి కుక్కల రఘు తదితరులు ఉన్నారు.

దామెర : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ మన్నెం ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ పార్టీని బలహీనపరచలేరని అన్నారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వరంగల్ పర్యటన సందర్భంగా దామెర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా ప్రజలు గమనిస్తున్నారని రాబోయేది కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు.

అరెస్ట్ అయిన వారిలో దామర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోలేపాక శ్రీనివాస్, దామెర గ్రామ ఉప సర్పంచ్ హింగే నాగేశ్వరరావు, సదిరం పోశయ్య, దామెర శంకర్ ,నల్ల రాజు ,నల్ల సుధాకర్, జక్కుల ఇందిరా, బిక్షపతి ,రాస మల్ల కిరణ్ తదితరులు ఉన్నారు.

నడికుడ : బిజెపి బహిరంగ సభ సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ను కాంగ్రెస్ నాయకులను పరకాల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

ఈ సందర్భంగా దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ హనుమకొండలో జరిగే బిజెపి బహిరంగ సభకు ముందస్తుగా అరెస్టు చేయడం సిగ్గు మారిన చర్య రానున్న రోజుల్లో ఈ నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ప్రజలు తప్పకుండా గుణపాఠం చెపుతారని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో నడికూడా మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ తో ఎన్ఎస్‌యు ఐ జాతీయ కోఆర్డినేటర్ మార్క అభినయ్ గౌడ్, అంబిర మనోజ్, నర్సక్కపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జుంకా జువా కుమారస్వామి, నడి కూడా మండల కిసాన్ సెల్ అధ్యక్షులు గుర్రాల సాంబ రెడ్డి, నడి కూడా మండల కోశాధికారి తలగంప రాజు తదితరులు ఉన్నారు.

ఘనంగా డాక్టర్ వైఎస్ఆర్ జయంతి







నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి కార్యక్రమం ఈ రోజు హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి స్వగహంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి గారు వై.ఎస్. చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండుసార్లు బాధత్యలు స్వీకరించి.. తన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేసుకున్నారు.పేదవాడి గుండె చప్పుడు బాగా తెలిసిన వ్యక్తి. తెలుగువారికి బ్రాండ్ అంబాసిడర్ ఆయన. తెలుగు జాతి ఉన్నంత కాలం చరిత్రలో రాజశేఖరరెడ్డి నిలిచారన్నారు. ప్రజల గుండెల్లో ఎప్పుడు చిరస్థాయిగా ఉండిపోయే వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి. ఈ రోజు అయన జయంతి సందర్భంగా ఇవే మా ఘన నివాళులు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తౌటం రవీందర్, పులి రాజు, నల్ల సత్యనారాయణ, దేశిని ఐలయ్య, బొంత సారంగం, మహమ్మద్ నజీర్, తౌటిరెడ్డి రవీందర్ రెడ్డి, నాయకులు మాడిశెట్టి సతీష్, మంద రాకేశ్, కురాకుల భారతి, కనుకుంట్ల కష్ణ, మహమ్మద్ నవీద్, క్రాంతి భరత్, డివిజన్ అధ్యక్షులు మహమ్మద్ జాఫర్, గాండ్ల స్రవంతి, ఎస్. కుమార్ యాదవ్, సింగారపు రవి ప్రసాద్, వల్లపు రమేష్, బి. శ్రీధర్ యాదవ్, పాలడుగుల ఆంజనేయులు, పోగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైస్ రాజశేఖర్ రెడ్డి 74 వ జయంతి సందర్భంగా మండల కేంద్రం లో శనివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కందికట్ల అనిల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ఎంపీటీసీ బోట్ల మహేంద్ర,యువజన అధ్యక్షులు కొమ్ము రమేష్,పర్వతగిరి మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు కత్తుల అయిలయ్య,పర్వతగిరి పట్టణ అధ్యక్షులు కూసం రాంచందర్, వరంగల్ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ ఎర్రబోయిన సాంబరాజు యాదవ్, మండల ఎస్సి సెల్ కన్వీనర్ నరకుడు రవీందర్, పోకల శంకర్, మూడు దేవరాజ్, నరేష్,మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దేవేందర్, మండల కార్యదర్శి నీలా మణికంట తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంతో ఘనంగా నిర్వహించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా వేడుకను నిర్వహించారు అనంతరం పండ్లు, స్వీట్లు పంచుకొని వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను స్మరించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, చార్ల శివారెడ్డి, ఇస్తారి శేఖర్,పెంతల కొమురరెడ్డి, పురుషోత్తం సురేష్, భూక్య బౌసింగ్, నల్లగొండ సుధాకర్, మామిండ్ల కొమురయ్య, బొట్ల మొగిలి, భరత్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్సార్ హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు జరిగాయని వైయస్సార్ ఆశయాలను కొనసాగిస్తామని జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కమలాపురం రమేష్ అన్నారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలో వైయస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కమలాపురం రమేష్,రాష్ట్ర సర్పంచుల ఫోరం నాయకులు పర్వతగిరి రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేకును కట్ చేసి ప్రజలకు కార్యకర్తలకు నాయకులకు పండ్లు,స్వీట్లు పంపిణి చేసారు.

ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ఎరుగొండ రవీందర్,ఓబిసి జిల్లా చైర్మన్ చిమ్మని దేవరాజు, నియోజకవర్గ కన్వీనర్ బయ్యు తిరుపతి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు,గ్రామ అధ్యక్షులు కుమారస్వామి,పాక్స్ డైరెక్టర్ రేవూరి జయపాల్ రెడ్డి, గుండెబోయిన శ్యామ్,యూత్ ప్రధాన కార్యదర్శి తనుగుల సందీప్, అలవాల రవి,అంజలి రమేష్ నాయకులు, వైఎస్ఆర్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైయస్సార్ హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాల అమలు

నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట : వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్, ఫీజు రియంబర్స్మెంట్ లాంటి పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశారని వైయస్సార్ టిపి మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 74 వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వద్దులకు, మహిళలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వైయస్సార్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రేగొండ మండల అధ్యక్షులు పల్లెబోయిన తిరుపతి, నాయకులు కుమార్, సారయ్య, మల్లేష్, స్వరూప, రాధమ్మ, నరేష్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి : గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తిలో మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించి జయంతి వేడుకలలో వైఎస్ చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి మాజీ జడ్పీటీసీ, ఎల్ఐసీ వెంకన్న, హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్‌కుమార్, 66వ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఆరెల్లి వెంకటస్వామి, ఎర్రగట్టు దేవస్థానం మాజీ చైర్మన్ జున్ను రవీందర్, హసన్‌పర్తి మాజీ సర్పంచ్ పుల్ల రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దూడల ప్రకాష్, కోడెల మురళి, మేకల సతీష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం పంటలతో అధిక దిగుబడులు

ఏడిఏ పరుశురాం నాయక్



నవతెలంగాణ-పాలకుర్తి

రైతులు ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి సారించి సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలు అర్జిస్తారని పాలకుర్తి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అజ్మీరా పరశురాం నాయక్ అన్నారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని ఈరవెన్ను గ్రామంలో ఆయిల్ ఫామ్ పంట క్షేత్రాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పరశురాం నాయక్ మాట్లాడారు. నీటి సదుపాయం కలిగిన ప్రతి రైతు కూడా అయిల్ ఫామ్ పంట సాగుకు మొగ్గు చూపాలని ఈపంట వలన అధిక దిగుబడులు పొందవచ్చునని రైతులకు సూచించారు. ఈ పంట సాగుకి ప్రోత్సాహం కింద ప్రభుత్వం నుంచి మొక్కలకు, డ్రిప్పు సదుపాయానికి రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల సర్పంచ్ ముస్కు నిర్మల చంద్రబాబు, ఎంపీటీసీ గాదరి యాదగిరి, గ్రామ రైతు కోఆర్డినేటర్లు ఉన్నారు.

వాణిశ్రీని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

ప్రధానోపాధ్యాయుడు మహంకాళి బుచ్చయ్య



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

చర్లపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివి అంచెలంచెలుగా ఎదిగి ప్రఖ్యాతిగాంచిన ట్రిబుల్ ఐటీకి ఎంపిక కావడం పాఠశాలకు గొప్ప గర్వకారణం అని చర్లపాలెం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహంకాళి బుచ్చయ్య అన్నారు. శనివారం పాఠశాలలో వాణిశ్రీని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ హిమాచల్ ప్రదేశ్‌లో పెట్రోలియం కెమికల్‌లో సీటు సాధించడం పాఠశాలకు గర్వకారణం అని విద్యార్థులు వాణిశ్రీని ఆదర్శంగా తీసుకొని కష్టపడి ఇష్టపడి చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తండా ప్రభాకర్ గౌడ్, జైపాల్ రెడ్డి, కర్నాకర్ రెడ్డి, సబీహాబాను, రవీందర్, మల్లేశం, శ్రీనివాస్, విద్యార్థిని తండ్రి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు















నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా శనివారం పిసిసి సభ్యులు, మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాపరెడ్డి స్థానిక క్యాంపు కార్యాలయం నుండి లేబర్ అడ్డ వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా నాయకులు సిద్ధారెడ్డి, యూత్ అధ్యక్షులు శివరాజ్ యాదవ్, పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీనివాస్, లీగల్సెల్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ది రాములు, కౌన్సిలర్ ముస్తాలా చందర్ తదితరులు మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్, ఎస్సీ సెల్ రాష్ట్ర స్పెషల్ మీడియా కోఆర్డినేటర్ విజయలక్ష్మి, కడప సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పొన్నాల కార్యాలయంలో...

మాజీ మంత్రి, టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య నియోజకవర్గ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మన్‌సాన్‌పల్లి లింగాజి, పట్టణాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్,ఎన్ఎస్ఐ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్ష వేణుమాధవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, వ్యవసాయ రంగంలో చెప్పుకోదగ్గ సంస్కరణలు చేయడం ద్వారా ప్రజల ఆదరణ పొందారన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి మాజీద్, సీనియర్ నాయకులు కట్ట కృష్ణ, రంగు రవి, మైనార్టీ సెల్ నాయకులు జాఫర్, ఉపాధ్యక్షులు సుల్తాన్ గోవింద్ రెడ్డి, పిట్టల రాజు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నోముల రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముహుర్తాల ప్రభాకర్, నాయకులు కొండ శీను, సత్యనారాయణ, మేకల సమ్మయ్య, చింతకింది శీను పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో వైయస్సార్ పథకాలు : కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్

మహబూబాబాద్ : తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, కాంగ్రెస్ మానుకోట పట్టణ అధ్యక్షులు గణపురపు అంజయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పట్టణ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాం నాయక్ పాల్గొని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం బలరాం నాయక్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ హయాంలో అనేక పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్,మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నునవత్ రాధ,కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్న యాదవ్,ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ నాయక్,మాజీ జడ్పీటీసీలు హెచ్ వెంకటేశ్వర్లు,జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు,వార్డు కౌన్సిలర్లు శ్రీను, జగన్, పెరుమాండ్ల గుట్టయ్య, మహిళ అధ్యక్షురాలు స్వర్ణలత, నర్సింగం శ్రీనివాస్ యాదవ్, రియాజ్ అన్సారీ, అంబాల శివకుమార్, వంశీ నాయక్,సీతారాం రెడ్డి,రాజవర్ధన్ రెడ్డి, ఇస్లావత్ రమేష్, భాస్కర్, వేల్పుల శేఖర్ యాదవ్, విజయ, మధు, ప్రణయ్, చెర్రీ, ఇంతియాజ్, అశోక్, కార్తీక్ పాల్గొన్నారు.

తొర్రూరు : తొర్రూరు డివిజన్ కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు.కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కందాడి అచ్చిరెడ్డి వైయస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలను ఆదుకున్నాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమా రాజశేఖర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు కర్ర అశోక్ రెడ్డి, రాంబాబు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రాంపల్లి రవి, వార్డు సభ్యులు మాచర్ల అరవింద్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు ధారావత్ దేవేందర్ నాయక్, నాయకులు షరీఫ్, నితీష్, అబ్బాసు, రంగయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట : ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్ దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి డెబ్బై నాలుగవ జయంతి వేడుకలను మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ హాజరై మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ అత్యున్నత పథకాలతో దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆత్మ గౌరవాన్ని పెంచి, దేశం మొత్తం గర్వించదగ్గ నాయకుడిగా మన్ననలు పొందాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్, సహకార సంఘ అధ్యక్షులు పన్నాల ఎల్లారెడ్డి, ఎస్.సి. సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, జిల్లా నాయకులు కణతల నాగేందర్ రావు, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సారయ్య, మండల ఉపాధ్యక్షులు తేళ్ల హరిప్రసాద్, ఎంపీటీసీ చాపల ఉమాదేవి-నరేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింత క్రాంతి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్య రాజు, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, సహకార సంఘ పాలకవర్గ సభ్యులు జెట్టి సోమయ్య, సర్పంచులు లావుడియా లక్ష్మి-జోగ నాయక్, భూక్య సుక్య, ఉపసర్పంచ్ బద్దం లింగారెడ్డి, గ్రామ అధ్యక్షులు రామచంద్రపు వెంకటేశ్వర్ రావు, 100 మంది పైగా కార్యకర్తలు పాల్గొన్నారు.

ములుగు : వైఎస్ఆర్ 74వ జయంతి సందర్భంగా వైయస్ఆర్ చిత్ర పటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ నివాళలర్పించారు. ములుగు, వెంకటపూర్ మండల కేంద్రాలలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి సందర్భంగా మండల అధ్యక్షులు ఎండి చాంద్ పాషా, వెంకటపూర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో శనివారం వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి కార్యక్రమం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అశోక్ మాట్లాడుతూ మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు అమోఘం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్, ఎన్ఎస్యూఐ జిల్లా అధ్యక్షులు మామిడిశెట్టి కోటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, మిల్కురి ఐలయ్య, చెన్నోజు శ్రీనివాస్, జంగిలి రవళి, అల్లాది రాజేశ్వర రావు, నల్ల కోటి, బుస్స గణేష్, ములుగు జిల్లా నాయకులు, ములుగు, వెంకట పూర్ మండల నాయకులు, గ్రామ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు,యూత్ నాయకులు, మహిళ నాయకురాల్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మంగపేట : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ వైఎస్.రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ ప్రధానకార్యదర్శి కారుపోతుల నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య మండల పార్టీ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రచార కమిటి చైర్మన్ పూజారి సురేందర్ బాబులు ముఖ్య అతిథులుగా హాజరై రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి సోమయ్య మాట్లాడుతూ వైఎస్ ముఖ్యమంత్రిగా అటవిహక్కుల చట్టం, ఫీజు రియిబర్స్ మెంట్, 108 అంబులెన్స్, ఆరోగ్య శ్రీ, రేషన్ కార్డ్, ఇందిరా జలప్రభ, రైతులకు సబ్సీడీపై వ్యవసాయ ఉపకరణాలు, రైతు ఋణమాఫీ, జలయజ్ఞం, నిరుద్యోగులకు కోసం డీఎస్సీలు ప్రకటించి రాష్ట్ర ప్రజలను ఆదుకున్నారని కొనియాడారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరి భాయి అనాథాశ్రమంలోని వృద్దులకు పండ్లు పాలు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లావుడ్యా శ్యాంలాల్, పెద్ది నర్సింహరావు, మైబూబ్ ఖాన్, కోడెల నరేష్, నర్రా కిషోర్, చాద మల్లయ్య, హిదాయతుల్లా, మురుకుట్ల నరేందర్, సయ్యద్ హుస్సేన్, సత్యనారాయణ, శశి, సర్దన నర్సయ్య, కుర్సం రమేష్, బండపెల్లి నర్సయ్య, ఆకు పవన్, మైప లాలయ్య, అయ్యోరు యానయ్య, తోట అశోక్, యాకుబ్, పొడెం నగేష్, బేత నర్సింగరావు, బాసారికారి హరికృష్ణ, నర్సయ్య, కిరణ్, తాలూకా సంపత్, బూర్గుల సతీశ్, ముసలయ్య చంటి, మురళి, నగేష్, రాకేష్ పాల్గొన్నారు

కొడకండ్ల : మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు ధారావత్ సురేష్ నాయక ఆధ్వర్యంలో అర్పించి ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ యువత అధ్యక్షులు ధరావత్ రాజేష్ నాయక్, మండల యూత్ అధ్యక్షులు యాకేష్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బిక్షపతి, ఎస్టీ సెల్ అధ్యక్షులు రాహుల్, ఎఫ్ఎస్‌సిఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, నర్సింగాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు కప్పల రంగయ్య, లక్ష్మక్కపెల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు జంపాల శ్రీనివాస్, నాయకులు మనోహర్, వంశీ, ఉప్పలయ్య, వెంకన్న, అంజయ్య, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గొప్ప మహనీయుడు ప్రజల గుండెల్లో కొలువైన గొప్ప నాయకుడు అని కాంగ్రెస్ పార్టీ బచ్చన్నపేట పట్టణ అధ్యక్షుడు కోడూరి మహత్మచారి అన్నారు. మండల కేంద్రంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా శనివారం నాడు ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బచ్చన్నపేట పట్టణ అధ్యక్షుడు కోడూరి మహత్మచారి,స్టేట్ కాంగ్రెస్ కిసాన్ కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్ మాట్లాడుతూ వైయస్సార్ ఉచిత వైద్యం, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగానిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబిసి జిల్లా వైస్ చైర్మన్ చెరుకురి శ్రీనివాస్ యాదవ్,వార్డు మెంబర్లు మహేందర్, బుచ్చిరాజు, దూడల సిద్ధయ్య బొమ్మర వేణు వందన, ఇదులకంటి వెంకట్ రెడ్డి, దేవరకొండ రమేష్, పందిపల్లి ఎల్లారెడ్డి, రాజయ్యవడ్డేపల్లి వెంకట్ రెడ్డి, నిల మల్లేషం,ఎండి షాబుద్దిన్, రవి, క్రాంతి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసి.. అన్ని వర్గాల ప్రజల కళ్ళల్లో సంతోషాన్ని నింపిన ఏకైక ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని తొర్రూరు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ అన్నారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైయస్సార్ చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందాడి అచ్చిరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్, మండల నాయకులు కర్ర అశోక్ రెడ్డి, రాంబాబు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రాంపల్లి రవి, వార్డు సభ్యులు మాచర్ల అరవింద్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు ధారావత్ దేవేందర్ నాయక్, షరీఫ్, నీతిశ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : దివంగత మాజీ ముఖ్య మంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని గూడూర్ మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో గుండెంగ గ్రామంలోని విగ్రహానికి పూల మాలతో నివాళి అర్పించి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నూనెవత్ రమేష్, మండల మాజీ పార్టీ అధ్యక్షుడు కత్తి స్వామి, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు యాకుబ్ పాషా, మండల ప్రధాన కార్యదర్శి బీరం శ్రీపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చంటి స్వామి, టౌన్ ప్రెసిడెంట్ రసూల్, సిటీ యూత్ ప్రెసిడెంట్ మండల మల్లేష్, మండల సీనియర్ నాయకులు కన్నేబోయిన వెంకన్న కృష్ణ, శంకర్, కిషన్ నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ తేజావత్ బాల్య నాయక్, మాలు నాయక్, రాములు తండ సర్పంచ్ గుగులోత్ సుగుణ లక్ష్మణ్ నాయక్, పడమటి తండ సర్పంచ్ గుగులోతు హుస్సేనీ బాలు నాయక్, గూడూరు వార్డు సభ్యులు రాసమల్ల యాకయ్య, గాజులగట్టు ఉపసర్పంచ్ ఎలికట్టె, గూడూరు మాజీ వార్డు సభ్యులు రాసమల్ల యాకయ్య, సూర గంగయ్య, హరి నాయక్ మండల, గ్రామ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి వేడుకలను శనివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో గల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కంబాల ముసలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటికి త్రాగునీటికి పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ పోలేబోయిన వెంకటేశ్వర్లు, రాసమళ్ళనాగేశ్వర్ రావు, నందగిరి బద్రయ్య, పోతుగంటి సుమన్, సొసైటీ డైరెక్టర్ కేతమల్లు, లింగయ్య, రావుల విష్ణు, కొయ్యగురి రామకష్ణ రెడ్డి, బండి యాదగిరి గౌడ్, గౌరిశెట్టి వెంకన్న, తిరుమల సుధాకర్ రెడ్డి, రామారావ్, రాములు, గండు శ్రీనివాస్, హచ్చు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గార్ల : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే స్టేషను ఎదురుగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ లక్ష్మీబాయి, కాంగ్రెస్ నాయకులు శనివారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహనీయులు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు గుండా వెంకటరెడ్డి, జె.శ్రీనివాస్, టి.కృష్ణ, పి.నారాయణ,బి.హతిరాం, బి.రవి, షంషాద్ బేగం, వినోద,బి.సురేష్, పఠాన్,వెంకటేశ్వర్లు, సాయి పాల్గొన్నారు.









సీతంపేట ఎంపిటీసి అధ్వర్యంలో...

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలను మండలంలోని సీతంపేట గ్రామంలో నియోజక వర్గ కాంగ్రెస్ మహిళ నాయకురాలు ఎంపిటీసి గుండె బోయిన నాగమణి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్ఆర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో షంషాబాద్, బాప్ సింగ్,మోహన్ రెడ్డి,వీర్యా, భద్రు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ : దివంగత మహానేత రాజశేఖర్ రెడ్డి 74వ జయంతిని పురష్కరించుకుని నియోజక వర్గ కేంద్రంలో ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, హన్మకొండ పశ్చిమ నియోజక వర్గ ఇంచార్జీ కొలిపాక సతీష్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించారు. వైఎస్సార్ ప్రజల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనికత కలిగిన నాయకుడని, ఎల్లప్పుడూ వైఎస్సార్ స్మరించబడాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రిగా సబ్బండ వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహానాయకుడని వర్ణించారు. ఈ కార్యక్రమంలో జంపాల శ్రీనివాస్, కుంభం ఉపేందర్, కలకోల రఘు, రవి, వినయ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఏఐబీబీజే జాతీయ ఉపాధ్యక్షుడు తూర్పాటి పాండు

నవతెలంగాణ-తొర్రూరు

చెమట చిందించి ఒక్కో రూపాయి పోగుచేసుకుని కొనుగోలు చేసిన భూమిని అక్రమంగా పట్టా చేసుకొని... ఆ భూమిలోని విలువైన టేకు చెట్లను అన్యాయంగా నరికి వేశారని, అట్టివారిపై తగిన చర్యలు తీసుకోవాలని అలిండియా బేడ బుడగ జంగాల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు తూర్పాటి పాండు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలోని 229 సర్వేనెంబర్‌లోని 1-20 ఎకరాల విలువైన భూమిని పలువురు అక్రమంగా పట్టా చేసుకున్నారని, దానిలోని 40 టేకు చెట్లను అన్యాయంగా నరికి వేశారని ఆరోపిస్తూ శనివారం డివిజన్ కేంద్రంలో బాధితులు ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.ఏబీబీజే నాయకుడు పాండు మాట్లాడుతూ పట్టణంలోని పేద బేడ బుడగ జంగాల సామాజిక వర్గానికి చెందిన కిన్నెర యాకయ్య అనేవ్యక్తి 1994లో తొర్రూరు పరిధిలోని దుబ్బ తండాకు చెందిన ధరావత్ శక్రు దగ్గర 229 సర్వేనెంబర్‌లోని 1-20 ఎకరాలను కొనుగోలు చేశాడని తెలిపారు. 1994 నుంచి 2020 వరకు కిన్నెర యాకయ్య పేరుపై భూమి పట్టా అయిందని, దానికి సంబంధించిన పహాణీలు తహసిల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.సదరు భూమి పట్టాదారు కిన్నెర యాకయ్య మరణించిన అనంతరం ధరావత్ శక్రు కుమారులు సర్వన్, కోట్యా దేవేందర్‌లు 2020లో ధరణిలో వారి పేరు నమోదు చేయించుకొని అక్రమంగా పట్టా చేయించుకున్నారని తెలిపారు. అక్రమంగా సదరు భూమిని పట్టా చేయించడంలో గత తహసిల్దార్ వేమిరెడ్డి రాఘవరెడ్డి కీలక పాత్ర పోషించాడని, వారి వద్ద ముడుపులు తీసుకొని పేదల పొట్ట కొట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.2014 నుంచి మోకాపై ఉన్న కిన్నెర యాకయ్య పేరు తొలగించి ధరావత్ శక్రు కుమారులపై పట్టా ఏ విధంగా చేస్తారని ప్రశ్నించారు. అక్రమంగా పట్టా చేసుకున్న సదరు భూమినివెంటనే కిన్నెర యాకయ్య కుమారులపై పట్టా చేయాలని, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలకు న్యాయం జరగకుంటే మంత్రి దయాకర్ రావు, సీఎం, రెవెన్యూ మంత్రి, జిల్లా కలెక్టర్లను ఆశ్రయిస్తామని తెలిపారు.ఆందోళనలో బాధితులు కిన్నెర సమ్మక్క, కిన్నెర శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అవగాహన అవసరం

నవతెలంగాణ-దంతాలపల్లి

క్యాన్సర్ వ్యాధి పై అవగాహన అవసరమని వైద్యులు సింధు, బాలవికాస సాంఘిక సేవ సంస్థ మండల కోఆర్డినేటర్ కందుకూరి సుకన్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో బాలవికాస సాంఘిక సేవ సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ దశలో వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తే అరికట్టవచ్చున్నారు. కార్యక్రమంలో శోభ, స్వర్ణలత, స్వరూప, ఏకలక్ష్మి, పాల్గొన్నారు.

సీపీయస్ మండల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-గార్ల

కాంట్రిబ్యూటరి పెన్షన్ స్కీమ్ మండల నూతన కమిటీ అధ్యక్షుడుగా బాదావత్ శ్రీను, కార్యదర్శిగా అడపాల ప్రసాద్‌రావులను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. మండలంలోని వివిధ శాఖలలోని సుమారు 100 మంది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంలో గల ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల శాఖ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాదావత్ శ్రీను మాట్లాడుతూ 2004 నుండి నూతన పెన్షన్ విధానంలో ఎన్నో లోప భూయిష్టమైన వంటి విధానాల వలన ప్రతి ఒక్క ఉద్యోగి కుటుంబంలో టెన్షన్ మొదలైందన్నారు. రెండు దశాబ్ద కాలం నుండి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేస్తే గాని గ్రాడ్యువిటీ, నిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్ సాధించామని గుర్తు చేశారు. పాత పెన్షన్ సాధించే వరకు తమ పోరాటాలను విస్మరించవద్దన్నారు.టీఎస్ సిపిఎస్ఈయు రాష్ట్ర శాఖ అధ్వర్యంలో జూలై 16 నుండి అన్ని జిల్లాల గుండాపాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నుండి ప్రారంభమై 20వ తారీఖున మానుకోట జిల్లా కేంద్రానికి రానున్నదని మండలంలోని అన్ని శాఖలలోని సిపిఎస్ ఉద్యోగులందరూ పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను జయప్రదం చేయడంలో భాగస్వాములు కావాలన్నారు.

ఘనంగా కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు


నవతెలంగాణ-జఫర్‌గడ్



మాజీ డిప్యూటీ సీఎం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలోని కడియం అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామ పంచాయతీలో సర్పంచులు కేకులు కట్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, మాజీ మార్కెట్ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎడ్ల వెంకటస్వామి, టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రాజేష్ నాయక్, మోహన్ రావు, అయోధ్య యాదగిరి, అన్నపు అశోక్, సర్పంచులు అనిత సుధాకర్ బాబు, మంద మల్లయ్య శ్రీదేవి, పెద్దిరెడ్డి సంపత్ రెడ్డి, కడియం యువసేన నాయకులు నాగరాజు, సారంగం, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రజలకు రక్షణ కవచంలా ఉంటా : ఎస్సై దిలీప్

నవతెలంగాణ-కొత్తగూడ



గంగారం ఏజెన్సీ మండల ప్రజలకు ఏ కష్టం వచ్చినా, ఎన్ని ఇబ్బందులు వచ్చినా రక్షణ కవచంలా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్సై దిలీప్ అన్నారు. ఇటీవల జరిగిన ఎస్ఐల బదిలీల్లో భాగంగా గంగారం ఎస్సై ఉపేందర్ బయ్యారంకు బదిలీ కాగా గూడూరులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దిలీప్ గంగారం ఎస్సైగా బదిలీ అయ్యారు. కాగా శనివారం గంగారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణలో తన వంతు కర్తవ్యాన్ని పాటిస్తానన్నారు.



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు

నవతెలంగాణ-బచ్చన్నపేట

ధూపదీప నైవేద్య అర్చకుల గౌరవ వేతనాన్ని 6 వేల నుండి 10 వేలకు పెంచినందుకుగానూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ తెలంగాణ సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మండలకేంద్రంలో శనివారం మార్కండేయ దేవాలయ ప్రాంగణంలో సంఘం జనగాం జిల్లా అధ్యక్షుడు త్రిపురారి మనోహర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ధూపదీప నైవేద్య అర్చకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసుదేవ శర్మ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో సాధించిన తెలంగాణలో హిందూ దేవాలయాలు పూర్వ వైభవాన్ని పొందుతున్నాయన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో రాష్ట్రంలో 18 వందల మంది ఉన్న ధూపదీప నైవేద్య అర్చకుల సంఖ్య తెలంగాణ సాకారం అయ్యాక చేపట్టిన నియామకాలతో ప్రస్తుతం 6 వేల 5 వందల మందికి చేరిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేయడానికి తెలంగాణలోని 33 జిల్లాలలో, ఉమ్మడి పది జిల్లాలలో అర్చకులతో ఆత్మీయ సమ్మేళనం ఈనెలలోనే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో హైదరాబాద్లో రాష్ట్ర స్థాయి సమావేశం 6 వేల 5 వందల మందితో భారీ సభను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిండిపోలు నాగ దక్షిణామూర్తి, ప్రధాన కార్యదర్శి అన్నావజ్ఝల ప్రసాద్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికీర్తి అమరేందర్ శర్మ, జనగాం జిల్లా గౌరవ అధ్యక్షుడు చండీశ్వర్, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు పవన్, జనగాం జిల్లా అర్చకులు గిరిప్రసాద్ శర్మ, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మహిళా నాయకులు

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే రాజయ్యను తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆపార్టీ నియోజక వర్గ అధికార ప్రతినిధి నాగపురి పావని ఆధ్వర్యంలో మహిళా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పాటుపడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో మండలఉపాధ్యక్షురాలు మాచర్ల నీలవేణి, మండల ప్రచార కార్యదర్శి గాదె అరుణ, సుజాత, లద్దునూరి ఎల్లమ్మ మేకల సరిత, కొలిపాక మౌనిక, శిరీష, తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ స్కూల్ నందు ప్రవేశం కొరకు ఎంపికలు

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాలనుసారం హైదరాబాదు హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్ యందు ప్రవేశానికి (2023-24) సంవత్సరానికిగాను జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించబడునని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగవ తరగతి యందు ప్రవేశానికి 1.9. 2014 నుండి 31.8.2015 మధ్య జన్మించిన బాల బాలికలు అర్హులని, పదవ తరగతి ప్రవేశానికి 1.9.2013 నుండి 31.8 2014 మధ్య సంవత్సరం లో జన్మించిన బాల బాలికలు అర్హులు అన్నారు. జిల్లా స్థాయి నందు పాల్గొనే బాల బాలికలు తమ వెంట ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రము, స్టడీ సర్టిఫికేట్, ప్రోగ్రెస్ రిపోర్టు, ఆధార్ కార్డు ఒక జత జిరాక్స్ ప్రతులు మరియు 3 పాస్పోర్ట్ సైజు ఫోటోలు తీసుకు రాగలరని తెలిపారు. కావున జిల్లా పరిధిలోని వివిధ మండలాలలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12వ తేది బుధవారము రోజున ఉదయం 8 గంటలకు జిల్లా హెడ్ క్వార్టర్స్ లోని ఎన్టీఆర్ స్టేడియం నందు హాజరు కాగలరని తెలిపారు.

కాంగ్రెస్ ఆర్థిక సహాయం


నవతెలంగాణ-గూడూరు



మండలంలోని సీతానాగరం గ్రామ పంచాయతీకి చెందిన ఫోటో గ్రాఫర్ సూత్రపు హరీష్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మరణించగా శనివారం గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లపుడూ అండగా ఉంటుందని భరోసా చారువ, తక్షణ సహాయంగా వారికి 50 కేజీల బియ్యంతో పాటు, ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు మండల పార్టీ అధ్యక్షులు శ్రీ నునావత్ రమేష్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు కత్తి స్వామి, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు యాకుబ్ పాషా, మండల ప్రధాన కార్యదర్శి బీరం శ్రీపాల్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చంటి స్వామి, టౌన్ ప్రెసిడెంట్ రసూల్, సిటీ యూత్ ప్రెసిడెంట్ మండల మల్లేష్, మండల నాయకులు కన్నేబోయిన వెంకన్న, సూర గంగయ్య, రాములు తండ సర్పంచ్ గుగులోత్ సుగుణ లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు

గూడూరు వాసీ తండ హరీష్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-గూడూరు



మహబూబాబాద్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వి.ఎస్ లక్ష్మీపురంలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తండ హరీష్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, పిహెచ్.డి డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎస్.రఘు పర్యవేక్షణలో 'సుంకిరెడ్డి నారాయణ రెడ్డి కవిత్వం, విమర్శ- పరిశీలన' అనే అంశంపై పిహెచ్. డి. పరిశోధన గావించి, సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించి, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించినందుకుగాను హరీష్ కు ఈ డాక్టరేట్ ప్రధానం చేశారు. పలువురు మిత్రులు, శ్రేయోభిలాషులు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.